మంగళవారం 08.09.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 139 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00



మంత్రి లోకేష్‌ను చూస్తే జగన్‌కు భయం పట్టుకుంది. అందుకే పారదర్శకంగా జరిగిన డీఎస్సీపై పదేపదే అసత్యాలు ప్రచారం చేయిస్తున్నారు. ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వని జగన్ ఇప్పుడు డ్రామాలు ఆడుతున్నారు. ప్రతిభతో ఉద్యోగాలు సాధించిన యువతను అవమానించడం దారుణం.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**



# ఫేక్ ప్రచారానికి.. ఫ్యాక్ట్‌తో కౌంటర్!



- వైసీపీ దుష్ప్రచారాన్ని తేలిగ్గా తీసుకోవద్దు
- 'హిట్-రన్-హైడ్' రాజకీయాలకు దీటుగా సమాధానం
- సోషల్ మీడియాలో వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి: సీఎం

**అమరావతి, సెప్టెంబర్ 07 (జర్నలిస్ట్ ఫైల్) :** పోలవరం సహా రాష్ట్రంలో అన్ని ప్రాజెక్టులూ నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి రాష్ట్రంలో ప్రతి ఎకరాకూ నీరు ఇచ్చి తెలుగు తల్లికి జలహారతి ఇస్తామని ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. వాటర్ మెన్ గా ఎకనామిక్ టైమ్స్ కథనం పేర్కొనటం సంతోషంగా ఉందని .. జల సంరక్షణపై చేస్తున్న కష్టానికి దక్కిన గుర్తింపని ఆయన అన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్న రెండు రోజుల లీడర్షిప్ కాన్‌క్లేవ్ లో నేతల్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. పొలిటికల్ గవర్నెన్సు కు ప్రాధాన్యత ఇస్తూ పాలనలో ముందుకు వెళ్తున్నామని ఆయన అన్నారు. కష్టకాలంలో నిలబడిన కార్యకర్తకు పూర్తి గౌరవం ఇస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల అనంతపురం జిల్లాకు చెందిన సామాన్య కార్యకర్త దళవాయి రమాదేవి దీనికి ప్రత్యక్ష ఉదాహరణ అని ముఖ్యమంత్రి అన్నారు. ప్రజల ఓటే గీటు రాయిగా పనిచేద్దామని నేతలకు పిలుపునిచ్చారు. 2029లో మరింత మెరుగ్గా ఫలితాలను సాధిద్దామని నేతల్లో ఉత్సాహం నింపారు. వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభంతో తన జన్మ ధన్యమైందని ముఖ్యమంత్రి అన్నారు. కృష్ణా జలాలను చూసి అక్కడి ప్రజల కళ్లల్లో ఆనంద భాష్పాలు వచ్చాయని తెలిపారు. ఎల్ నినో విపత్తుపై అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. మిగతా 2లో...

## నియోజకవర్గానికి రూ.కోటి.. 25 లక్ష్యాలు!

- అభివృద్ధి పనులకు ప్రాధాన్యతాక్రమం
- కేడర్‌తో సమన్వయం.. ప్రజలతో నిరంతర మమేకం
- స్థానిక ఎన్నికల్లో గెలుపే తొలి అడుగు: సీఎం

8 లో

## స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- టీడీపీ నేతలకు చంద్రబాబు దిశానిర్దేశం
- కూటమిలో సమన్వయంతో పనిచేయాలని సూచన

2 లో

## పార్టీయే సుప్రీం.. పార్టీ ఆదేశాలకే ప్రాధాన్యం ఇవ్వాలి

**టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్**



**అమరావతి, సెప్టెంబర్ 7 (జర్నలిస్ట్ ఫైల్) :** పార్టీయే సుప్రీం అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. పార్టీ పదవుల్లో ఉన్న వారిని మంత్రులు, ఎమ్మెల్యేలు తప్పనిసరిగా గౌరవించాలని ఆదేశించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమ, మంగళవారాల్లో నిర్వహిస్తున్న టీడీపీ ఎమ్మెల్యేల రెండు రోజుల శిక్షణ తరగతుల్లో లోకేశ్ పాల్గొని పార్టీ నాయకత్వం, కార్యకలాపాలపై దిశానిర్దేశం చేశారు.

పార్టీ ఏదైనా పని అప్పగిస్తే దానికే అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి తప్పనిసరిగా పూర్తి చేయాలని లోకేశ్ సూచించారు. పార్టీ కార్యక్రమాలు, పార్టీ ఇచ్చే బాధ్యతల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. క్వాంటం టవర్స్‌కు సంబంధించిన కార్యక్రమానికి తనను ఆహ్వానించిన సందర్భంలో పార్టీ తనకు అప్పగించిన పని ఉందని, అందుకే తాను ఆ కార్యక్రమానికి రాలేనని చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. పార్టీ అప్పగించిన పనులకు హై ప్రయారిటీ ఇవ్వాల్సిందేనని ఎమ్మెల్యేలకు స్పష్టం చేశారు.

పార్టీ పదవుల్లో ఉన్న వారు పార్టీ కార్యక్రమాలకు హాజరయ్యేందుకు ఎవరి అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని లోకేశ్ క్లారిటీ ఇచ్చారు. పార్టీ పదవులు, బాధ్యతలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా మిగతా 2లో...

## ఆశా పోస్టుల్లో.. 'జీరో వెకెన్సీ'!



**913 ఖాళీల భర్తీకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్**

**కూటమి ప్రభుత్వంలో ఇప్పటికే 1,294 నియామకాలు**

**తాజా పోస్టులతో మొత్తం 2,207 భర్తీలు: మంత్రి సత్యకుమార్**

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ప్రజల ముంగిటకు వైద్య సేవలు చేరువ చేయడంలో కీలకంగా వ్యవహరించే ఆశా ( సామాజిక ఆరోగ్య కార్యకర్త) కార్యకర్తల్లో ప్రస్తుతం ఖాళీగా ఉన్న 913 పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపినట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. వీటి భర్తీతో రాష్ట్రంలోని ఆశా పోస్టులన్నీ భర్తీ అయినట్లవుతుందని పేర్కొన్నారు. జీరో వెకెన్సీ విధానంలో ఈ పోస్టుల భర్తీ చేపడుతున్నామని తెలిపారు. గడిచిన రెండు సంవత్సరాల్లో 1,294 ఆశా పోస్టులను భర్తీ చేశామని, తాజా 913 పోస్టులతో కలిపితే మొత్తం 2,207 పోస్టులు భర్తీ చేసినట్లవుతుందని మంత్రి తెలిపారు. తాజా ఖాళీల్లో 673 గ్రామీణ, 64 గిరిజన, 176 పట్టణ పోస్టులు ఉన్నాయని వెల్లడించారు. మిగతా 2లో...


## ప్రముఖ యూట్యూబర్ నందన అరెస్ట్

- శంషాబాద్ విమానాశ్రయంలో అదుపులోకి
- యూకే ఉద్యోగాల పేరుతో పలువురి నుంచి భారీగా వసూళ్లు
- గతంలోనే కేసులు.. లుక్‌అవుట్ నోటీసులు జారీ



**శంషాబాద్:** యూకే వీసా, ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రముఖ యూట్యూబర్ నందనను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. లండన్‌లో పర్మినెంట్ ఉద్యోగాలు, భారీ వేతనాలు ఇప్పిస్తామంటూ పలువురు నిరుద్యోగుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసి పరారీలో ఉన్న ఆమెను మిగతా 2లో...

## మోదీ సభకు భారీ స్పందన



- గంటలోపే సీట్లన్నీ ఫుల్..
- వెయిటింగ్ లిస్టులో 42 వేల మందికి పైగా
- తొలిసారి 'బుక్ మైషో'లో ఉచిత ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్

**వడోదర:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొననున్న సభకు ప్రజల నుంచి భారీ స్పందన లభించింది. గుజరాత్‌లోని వడోదరలో మంగళవారం జరగనున్న కార్యక్రమానికి తొలిసారిగా 'బుక్ మైషో' వేదికగా ఉచిత ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేపట్టగా.. ప్రారంభించిన గంటలోపే అందుబాటులో ఉన్న సీట్లన్నీ నిండిపోయాయి. ఆ తర్వాత కూడా పెద్ద సంఖ్యలో ప్రజలు రిజిస్ట్రేషన్ కోసం ప్రయత్నించడంతో 42 వేల మందికి పైగా వెయిటింగ్ లిస్టులో చేరారు.

**రూ.35 వేల కోట్లకు పైగా విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం :** ప్రధాని మోదీ మంగళవారం వడోదరలో పర్యటించనున్నారు. మిగతా 2లో...

## మెగా డీఎస్సీపై ఆరోపణలు అవాస్తవం



- టెట్, క్రీడా ధ్రువపత్రాలపై వస్తున్న ఆరోపణలకు విద్యాశాఖ, శాప్ వివరణ
- అర్హతలపై అనుమానాలకు అధికారిక రికార్డులతో సమాధానం
- డీఎస్సీ ఎంపికల్లో పారదర్శకతకు పెద్దపీట

**అమరావతి, సెప్టెంబర్ 7 (జర్నలిస్ట్ ఫైల్):** క్రీడా కోటా ద్వారా నిర్వహించిన మెగా డీఎస్సీ-2025లో అభ్యర్థుల టెట్ అర్హతలు, కుల ధ్రువీకరణ, క్రీడా ధ్రువపత్రాల ప్రామాణికతపై సామాజిక మాధ్యమాలు, వివిధ ప్రసార మాధ్యమాల్లో వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా, శాప్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ భరణి స్పష్టం చేశారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో వారు అధికారిక రికార్డులు, మిగతా 3లో...

**పశ్చిమ చిత్తూరుకు**

## 'అమరజీవి జలధారలు'

- రూ.2,370 కోట్లతో భారీ తాగునీటి ప్రాజెక్టు
- 25 లక్షల మందికి శాశ్వత నీటి భద్రత
- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిరంతర పర్యవేక్షణలో పనులు వేగవంతం



**చిత్తూరు, సెప్టెంబర్ 7 (జర్నలిస్ట్ ఫైల్) :** ఉమ్మడి చిత్తూరు జిల్లా పశ్చిమ ప్రాంతంలో తాగునీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం చూపే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధారల చిత్తూరు మల్టీ విలేజ్ వాటర్ సప్లై స్కీమ్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. రూ. 2,370 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ భారీ ప్రాజెక్టు ద్వారా మూడు నియోజకవర్గాల పరిధిలోని 18 మండలాల్లో 3,163 ఆవాసాలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించనున్నారు. ఈ పథకం పూర్తయితే దాదాపు 25 లక్షల మంది ప్రజలకు శాశ్వత తాగునీటి భద్రత లభించనుంది.

**వారాంతపు లక్ష్యాలతో పనుల వేగవంతం :** అత్యంత తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో చేపట్టిన తాగునీటి ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు వారాంతపు లక్ష్యాలను నిర్దేశించుకుని పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. ఏడాది చివరినాటికి మిగతా 2లో...



## స్వర్ణభారత్ ట్రస్ట్ సేవలు ఆదర్శనీయం

- ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్

**వెంకటాచలం, సెప్టెంబర్ 7 (జర్నలిస్ట్ ఫైల్) :** పేద పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పి, వారికి అవసరమైన అన్ని వసతులు కల్పించడం గొప్ప సమాజ సేవ అని ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అన్నారు. యువతకు వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ రజతోత్సవ కార్యక్రమంలో సోమవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రసంగం ప్రారంభంలో తెలుగులో 'అందరికీ వందనం' అంటూ సభికులను పలకరించి ఉత్సాహపరిచారు.

కరోనా మహమ్మారి సమయంలో అనేక మంది తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు ఉత్తర్‌ప్రదేశ్‌లోని అటల్ ఆవాస్ విద్యాలయాల్లో ఉచిత విద్య అందిస్తున్నట్లు యోగి తెలిపారు. గురుకుల పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు స్ఫూర్తిగా నిలిచారని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించుకునే దేశమే వేగంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. మిగతా 2లో...

# ఆశా పోస్టుల్లో.. 'జీరో వెకెన్సీ'!

(మొదటి పేజీ తరువాయి)

**డిస్ట్రిక్ట్ హెల్త్ సొసైటీ ద్వారా... :** కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ పోస్టుల భర్తీ జరగనుంది. జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న డిస్ట్రిక్ట్ హెల్త్ సొసైటీ ద్వారా నియామకాలు చేపట్టనున్నారు. సంబంధిత గ్రామం లేదా వార్డుకు చెందిన స్థానిక మహిళల్లో పదో తరగతి కనీస అర్హత కలిగి, 25-45 ఏళ్ల మధ్య వయసున్న వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. నియమ నిబంధనలను అనుసరించి ఈ నెల 30వ తేదీ నాటికి నియామకాల జాబితాను పంపించాలని జిల్లాలకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్ బాబు తెలిపారు.

**జిల్లాల వారీగా పోస్టుల వివరాలు :** జిల్లాల వారీగా చూస్తే... అనకాపల్లిలో 77, కర్నూలులో 65, తూర్పుగోదావరిలో 44, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 43, పార్వతీపురం మన్యంలో 43, పశ్చిమగోదావరిలో 42, అన్నమయ్యలో 41, ప్రకాశంలో 38, వైఎస్సార్ కడపలో 38, కృష్ణాలో 37, విశాఖపట్నంలో 33, చిత్తూరులో 32, కోనసీమలో 32, పల్నాడులో 31, విజయనగరంలో 31, కాకినాడలో 29, ఎస్పీఎస్ఆర్ నెల్లూరులో 29, ఏలూరులో 27, అనంతపురంలో 26, మార్కాపురంలో 25, శ్రీ సత్యసాయి జిల్లాలో 22, శ్రీకాకుళంలో 22, గుంటూరులో 21, నంద్యాలలో 21, పోలవరంలో 21, తిరుపతిలో 21, ఎన్టీఆర్ జిల్లాలో 15, బాపట్లలో 7 చొప్పున ఖాళీలు ఉన్నాయి.

**నెలకు రూ 10,000 వేతనం :** ఒక్కో ఆశా కార్యకర్తకు నెలకు రూ. 10 వేల చొప్పున వేతనం లభిస్తుంది. ఇందులో రూ. 8,320 రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ ద్వారా, మిగిలిన మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తుంది. ప్రతి ఏడాది ఆశా కార్యకర్తలకు వేతనాల రూపంలో రూ. 513 కోట్ల వరకు చెల్లింపులు జరుగుతున్నాయి. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ. 426. 84 కోట్ల వరకు భరిస్తుండగా, మిగిలిన మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తోంది.

# ప్రముఖ యూట్యూబర్ నందన అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నందన, ఆమె భర్త మధుకర్‌పై విదేశీ ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడినట్లు గతంలోనే కేసులు నమోదయ్యాయి. బాధితుల ఫిర్యాదుల ఆధారంగా కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో నందనపై లుక్‌అవుట్ నోటీసులు జారీ చేశారు.

**ఇమ్మిగ్రేషన్ అధికారుల అప్రమత్తతతో.. :** లుక్‌అవుట్ నోటీసుల నేపథ్యంలో నందన కదలికలపై పోలీసులు, ఇమ్మిగ్రేషన్ అధికారులు నిఘా ఉంచారు. సోమవారం ఆమె శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న సమయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు వెంటనే ఆమెను అదుపులోకి తీసుకున్నారు. విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నందన దంపతులు పలువురిని నమ్మించినట్లు బాధితులు ఆరోపించారు. లండన్‌లో శాశ్వత ఉద్యోగాలు, భారీ వేతనాలు వస్తాయని ఆశ చూపి నిరుద్యోగుల నుంచి భారీ మొత్తంలో నగదు వసూలు చేసినట్లు ఫిర్యాదులు అందాయి. ఈ ఆరోపణలపై పోలీసులు ఇప్పటికే కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగింత :** శంషాబాద్ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్న నందనను తదుపరి విచారణ నిమిత్తం పోలీసులు ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. కేసుకు సంబంధించిన వివరాలను ఆమె నుంచి రాబట్టేందుకు పోలీసులు విచారణ చేపట్టనున్నారు. ఇదే వ్యవహారంలో ఆమె భర్త మధుకర్ పాత్రపైనా పోలీసులు ఆరా తీస్తున్నారు. నందనపై నమోదైన కేసులు, జారీ చేసిన లుక్‌అవుట్ నోటీసుల ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు.

# మోదీ సభకు భారీ స్పందన

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా నగరంలో రూ. 35 వేల కోట్లకు పైగా విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. పూర్తయిన కొన్ని ప్రాజెక్టులను జాతికి అంకితం చేయనున్నారు. అనంతరం నిర్వహించే బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

**తొలిసారి 'బుక్ మైషో' ద్వారా.. :** ప్రధాని కార్యక్రమానికి హాజరయ్యే ప్రజల కోసం వడోదర మున్సిపల్ కార్పొరేషన్ (వీఎంసీ) తొలిసారిగా 'బుక్ మైషో'ను ఉపయోగించింది. కార్యక్రమానికి ఎలాంటి రుసుము లేకుండా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ అవకాశం కల్పించింది. రిజిస్ట్రేషన్ ప్రారంభమైన కొద్దిసేపటికే సీట్లన్నీ నిండిపోవడం విశేషం. అనంతరం కూడా రిజిస్ట్రేషన్ కోసం భారీగా ప్రజలు ఆసక్తి చూపడంతో వెయిటింగ్ లిస్టు 42 వేలు దాటింది.

ప్రధాని కార్యక్రమానికి ముందుగానే ఈ స్థాయిలో స్పందన రావడం వడోదరలో మోదీ పర్యటనపై ప్రజల్లో నెలకొన్న ఆసక్తి, ఉత్సాహాన్ని ప్రతిబింబిస్తోందని అధికారులు పేర్కొన్నారు.

# గుంటూరు కార్పొరేషన్‌కి జాతీయ స్థాయి గుర్తింపు

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** వాయు కాలుష్య నియంత్రణలో ప్రత్యేక చర్యలు తీసుకున్న గుంటూరు కార్పొరేషన్‌కి 'స్వచ్ఛ వాయు సర్వేక్షణ్' – 2026 ప్రతిష్ఠాత్మక జాతీయ పురస్కారం దక్కింది. 'స్వచ్ఛ వాయు దివస్' సందర్భంగా న్యూఢిల్లీలోని ఇందిరా పర్యావరణ్ భవన్‌లో సోమవారం కేంద్ర పర్యావరణ శాఖ నిర్వహించిన కార్యక్రమంలో భారత జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జిటి) చైర్‌పర్సన్ జస్టిస్ ప్రకాష్ శ్రీవాస్తవ, గుంటూరు నగర కమిషనర్ కె మయూర్ అశోక్ ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును స్వీకరించారు. దేశవ్యాప్తంగా 130 నగరాల మధ్య జరిగిన పోటీల్లో గుంటూరు పట్టణాల కేటగిరిలో ద్వితీయ స్థానంలో నిలిచింది. రాష్ట్ర స్థాయిలో కేటగిరీ రెండు (10,000 నుండి 30,000 జనాభా వర్గం)లో జిఎంసి 42వ వార్డు తొలి స్థానంలో నిలిచింది. పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ, గుంటూరు నగరవాసులకు కమిషనర్ అభినందనలు తెలిపారు.

# ఫేక్ ప్రచారానికి.. ఫ్యాక్ట్‌తో కౌంటర్!

(మొదటి పేజీ తరువాయి)

దీనిపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతీ కార్యక్రమంలో ప్రజల్ని భాగస్వాములు చేయాలన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు, వెలిగొండ, పోలవరం ఎడమ కాల్వ ప్రారంభోత్సవాల్లో ప్రజలు భాగస్వాములయ్యారని తెలిపారు. జిల్లాలు నియోజకవర్గాల వారీగా విజన్ ప్లాన్ ఇచ్చామని పరిపాలనా వెసులుబాటు కోసం ప్రత్యేకంగా కార్యాలయం ఏర్పాటు చేశామన్నారు. ప్రజా ప్రతినిధులు సమర్ధ నాయకత్వం వహించాలన్నారు. సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో బాగా పనిచేసే వారిని ప్రోత్సహిస్తున్నామని పొలిట్ బ్యూరో, చట్ట సభల్లోకి తీసుకు వచ్చామన్నారు. పార్టీ బలోపేతం కావాలంటే కార్యకర్త బలంగా ఉండాలన్నారు. రాజకీయ పార్టీ బలపడటం ఎంత ముఖ్యమూ కూటమి ఐక్యత కూడా అంతే ముఖ్యమని సీఎం దిశానిర్దేశం చేశారు. ఫోటోల గురించి ఫ్లెక్సీల గురించి వివాదాలు వద్దని కూటమిగా కలిసి క్షేత్రస్థాయికి వెళ్లాలన్నారు. 2024 కంటే ఎక్కువ ఓట్లు వచ్చేలా పనిచేయాలని అన్నారు. పనిచేయటంతో పాటు చేసిన పనిని సమర్ధంగా ప్రజల్లోకి తీసుకెళ్లటం కూడా ముఖ్యమన్నారు.

**వాటర్ మాన్ కు లీడర్షిప్ కాన్ క్లేవ్ అభినందన :** అంతకు ముందు కాన్ క్లేవ్ లో సీఈఓ సీఎం టూ వాటర్ మాన్ అంటూ ఎకనామిక్ టైమ్స్ రాసిన కథనంపై జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ముఖ్యమంత్రికి అభినందన తీర్మానం ప్రవేశ పెట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో ఐటీకి ప్రాధాన్యం ఇచ్చి తెలుగు యువతను ఐటీ నిపుణులుగా మార్చిన ముఖ్యమంత్రి ఇప్పుడు సాగునీటి ప్రాజెక్టులు, జల సంరక్షణతో వాటర్ మ్యాన్ గా మారారని అన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర సహా వివిధ ప్రాంతాలకు జల వనరులు అందించేలా డ్రిప్ ఇరిగేషన్ సహా వివిధ ప్రాజెక్టులను అందుబాటులోకి తెచ్చారని ఎకనామిక్ టైమ్స్ తన కథనంలో పేర్కొందని మంత్రి వెల్లడించారు. జలం ఉంటేనే జనం, జలం ఉంటేనే అభివృద్ధి, ప్రగతి అన్న నినాదంతో 2014 రాష్ట్ర విభజన తర్వాత ఏపీలో పోలవరం, వెలిగొండ లాంటి ప్రాజెక్టులు చేపట్టిన సీఎంకు ఎకనామిక్ టైమ్స్ ప్రశంసలు తెలిపిందని స్పష్టం చేశారు. పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా కృష్టా డెల్టాకు నీరు తేవటంతో పాటు రాయలసీమ ప్రాంతానికి హంద్రీనీవా ద్వారా నీరిచ్చారని ఎకనామిక్ టైమ్స్ కథనం తెలిపిందని అన్నారు. ఏపీలో ఉన్న 4 కోట్ల ఎకరాల భూమిలో 2 కోట్ల ఎకరాలు మాత్రమే సాగు చేసేందుకు ఆస్కారం ఉందని గుర్తించి నీరిచ్చేందుకు ఆయన కృషి చేస్తున్నారని కథనం వెల్లడించిందన్నారు. ఇంత పెద్ద మొత్తంలో భూమి సాగుకిందకు రావాలంటే ప్రాజెక్టులు పూర్తి చేయటం ఒక్కటే మార్గమని సీఎం పాలసీగా పెట్టుకున్నట్టు ఎకనామిక్ టైమ్స్ రాసిందని మంత్రి తెలిపారు. వెలిగొండ, పోలవరం ఎడమ కాలువను వేగంగా పూర్తి చేసి ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు తీసుకెళ్లటంలో




సీఎం కృషిని ఇటి కథనంలో ప్రస్తావించిందన్నారు. 2027 పుష్కరాలకంటే ముందుగానే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తారన్న లక్ష్యాన్ని కూడా ఈటీ తన కథనంలో పేర్కొంది. వచ్చే 3 ఏళ్లలో రూ. 35 వేల కోట్లతో 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసే అంశాన్ని కూడా ప్రతిష్టాత్మక ఎకనామిక్ టైమ్స్ తన కథనంలో ప్రశంసించిందన్నారు. జల ధార కార్యక్రమం ద్వారా భూగర్భజలాలను పెంచటంలో కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రణాళికలు చేస్తున్నారని ఈటీ కథనంలో వెల్లడించినట్టు స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి అవసరాలకు అనుగుణంగా ఏపీకి సీఈఓగా మారిన సీఎం.. ప్రస్తుతం నీటి విలువను గుర్తించి వాటర్ మాన్ గా రూపాంతరం చెందారని ఎకనామిక్ టైమ్స్ తన కథనంలో పేర్కొందని మంత్రి నిమ్మల రామానాయుడు వివరించారు. సాగునీటి రంగంపై చేస్తున్న కృషికి గానూ తెలుగుదేశం పార్టీ నేతలంతా స్టాండింగ్ ఓవేషన్ తో ముఖ్యమంత్రికి అభినందనలు తెలిపారు.

**నాయకత్వానికి చిరునామా టీడీపీ :** నాయకత్వానికి కేరాఫ్ అడ్రస్ తెలుగుదేశం పార్టీ అని ముఖ్యమంత్రి అన్నారు. పార్టీలో తొలిసారిగా లీడర్షిప్ కాన్ క్లేవ్ ను నిర్వహిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. దీనిపై ఆయన మాట్లాడుతూ..సమర్ధ నాయకత్వంతోనే సమస్యల పరిష్కారం దొరుకుతుంది. వర్తమానాన్ని అర్ధం చేసుకుని భవిష్యత్తును అంచనా వేయాలి. గత పాలకులు రాష్ట్రాన్ని వెంటిలేటర్‌పై నిలబెట్టారు. వ్యవస్థలను విధ్వంసం చేశారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం ప్రధాని మోదీ, పవన్ కళ్యాణ్‌తో కలిసి కూటమిగా ప్రజల మద్దతు దక్కించుకున్నాం. పాలకుడు ఏ విధంగా ఉండకూడదో అనే దానికి గత పాలకుడే ఓ కేస్ స్టడీ. కేంద్ర సహకారంతో ఇచ్చిన హామీల అమలుకు అనునిత్యం పనిచేస్తున్నాం. అభివృద్ధి–సంక్షేమం–సుపరిపాలనను బ్యాలెన్స్ చేస్తూ పాలన చేపట్టాం. నెలకు నాలుగు రోజులు తక్కువ కాకుండా క్షేత్రస్థాయిలో ఉంటున్నాను. పేదల సేవలో, మీ భూమి–మీ హక్కు, స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర, సంజీవని కార్యక్రమాల ద్వారా ప్రజలతో మమేకం అవుతున్నాను. విద్య–వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నాం...ప్రైవేట్ స్కూళ్లకు గుడ్ బై



చెప్పి ప్రభుత్వ పాఠశాలకు వస్తున్నారు. 63 లక్షల మందికి రూ. 73 వేల కోట్ల మేర ఫించన్ ఇప్పటికే పంపిణీ చేశాం. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, అన్న క్యాంటీన్ల, ఆటో డ్రైవర్ల సేవలో, నేతన్నల సేవలో, దీపం, మత్స్యకారుల సేవలో వంటి చాలా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం. మెగా డీఎస్సీ ద్వారా టీచర్ల రిక్రూట్మెంట్ చేశాం. ఒక్క డీఎస్సీ కూడా పెట్టని వ్యక్తి మనపై విమర్శలు చేస్తున్నారు. మూడు ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేస్తున్నాం. నిర్దేశిత గడువులోగా పోలవరం, అమరావతి పూర్తి అవుతాయి. 28 పాలసీలతో 23 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. పరిశ్రమలు గ్రౌండ్ అవుతున్నాయి. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ద్వారా ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు వచ్చాయి. గుగుల్, ఆర్సెలార్ లాంటి పరిశ్రమలతో ఉత్తరాంధ్ర ఇప్పుడు అభివృద్ధికి కేంద్రం. అమరావతి క్వాంటం టెక్నాలజీతో పాటు నాలెడ్జి హబ్ గా మారుతుంది. రాయలసీమ రైజింగ్ నినాదంతో గోల్డ్ ఫీల్డ్, ఆమ్కా డిఫెన్స్ ప్రాజెక్టు, కడప స్టీల్ ప్లాంట్ వచ్చాయి. త్వరలో హార్టికల్చర్ హబ్ గా మారుతుంది. డేటా ఇంటిగ్రేషన్ ద్వారా పౌరసేవల్ని సులభతరం చేశాం. రెవెన్యూ సమస్యల పరిష్కారం తో పాటు రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తాలు అందిస్తున్నాం. క్యూఆర్ కోడ్ బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో భూములకు భద్రత కల్పిస్తున్నాం. 22 ఏ భూముల వివాదాన్ని పరిష్కరిస్తున్నాం. దీర్ఘకాలంగా పరిష్కారం కాని సమస్యలను పరిష్కరిస్తే ప్రజా ప్రతినిధులను ప్రజలు గుండెల్లో పెట్టుకుంటారు. " అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

**ఫేక్ ప్రచారానికి ఫ్యాక్ట్ తో గట్టిగా కౌంటర్ :** వైసీపీ చేస్తున్న ఫేక్ ప్రచారాన్ని తేలిగ్గా తీసుకోవద్దని ఫ్యాక్ట్ తో గట్టిగా కౌంటర్ ఇవ్వాలని ముఖ్యమంత్రి నేతలకు దిశానిర్దేశం చేశారు. గొడ్డలి పార్టీ ఉగ్రవాదుల తరహాలో హిట్ – రన్ – హైడ్ విధానాన్ని అనుసరిస్తోందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో జరుగుతున్న ఓ మంచి పనిపై విమర్శలు చేసేందుకు గొడ్డలి పార్టీ సిద్ధంగా ఉంటోదన్నారు. గతంలో టన్నెల్ బోరింగ్ మిషన్ అడ్డంగా ఉన్నప్పటికీ.. పనులు పూర్తి కాకపోయినా వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం అంటూ డ్రామాలాడారన్నారు. ఆ ప్రాజెక్టును ఇప్పుడు పూర్తి చేసి ప్రారంభిస్తే అది ఎప్పుడే పూర్తి చేసేశామని మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి నీరసిస్తే గోదావరి జలాలు కావు పురుషోత్తపట్నం నుంచి వచ్చాయంటున్నారని.. కానీ ఆ ప్రాజెక్టుకు గొడ్డలి పార్టీ నాడు అడ్డుపడిందని గుర్తు చేశారు. ఆ పార్టీ చేస్తున్న వక్రీకరణలకు దిమ్మతిరిగేలా సమాధానం చెప్పాలన్నారు. ఏపీపీఎస్సీలో అడ్డగోలుగా అక్రమాలు చేశారని అడుగడుగునా అవకతవకలకు పాల్పడ్డారన్నారు. అసెంబ్లీలో చర్చిస్తే వాస్తవాలు బయటకు వస్తాయని ప్రజలు చూస్తారనే భయం వారిలో ఉందని అన్నారు. బయట కూర్చుని అసత్యాలు అదే పనిగా చెబుతారని ఎద్దేవా చేశారు. సామాజిక మాధ్యమాలైన యూట్యూబ్, ఇన్ స్టా గ్రామ్ లో యాక్టివ్ గా ఉంటూ దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని అన్నారు. ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారు మరింతగా ఎదిగేందుకు పూర్తిగా సహకరిస్తామని వారు కూడా అదేస్థాయిలో పనిచేయాలని అన్నారు. నాయకత్వాన్ని పెంచుకుని ప్రజలకు మరింత సేవ చేయాలని పార్టీకి బలం చేకూర్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

# స్వర్ణభారత్ ట్రస్ట్ సేవలు ఆదర్శనీయం

(మొదటి పేజీ తరువాయి)

యువత ఎంత ఉన్నత స్థానాలకు చేరుకున్నా దేశం పట్ల భక్తి, బాధ్యత కలిగి ఉండాలని సూచించారు. ఎక్కడికి వెళ్లినా 'నేషన్ ఫస్ట్' అనే భావనతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

**జాతి నిర్మాణంలో విద్య కీలకం :** పేద పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పడం ద్వారా వారిని ఉన్నతంగా తీర్చిదిద్దడంతో పాటు దేశ నిర్మాణానికి తోడ్పడినట్లవుతుందని యోగి ఆదిత్యనాథ్ అన్నారు. గ్రామీణ ప్రాంతాలు జ్ఞానం, ఆర్థిక అభివృద్ధికి మూలకేంద్రాలుగా మారాలని ఆకాంక్షించారు. ఒకప్పుడు గ్రామాలు స్వయం సమృద్ధిగా ఉండేవని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గ్రామీణ ఉత్పత్తులకు ప్రపంచస్థాయి మార్కెటింగ్ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. స్వర్ణభారత్ ట్రస్ట్ 25 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని యోగి ప్రశంసించారు. విద్యతో పాటు నైపుణ్య శిక్షణకు ప్రాధాన్యం ఇస్తూ గ్రామీణ యువత, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడం గొప్ప కార్యక్రమమని అన్నారు. ఉత్తర, దక్షిణ భారతదేశాల మధ్య వారధిగా వెంకయ్యనాయుడు పనిచేశారని కొనియాడారు.

**స్వర్ణభారత్ ట్రస్ట్ నా మానసపుత్రిక :** మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు మాట్లాడుతూ స్వర్ణభారత్ ట్రస్ట్ తన మానసపుత్రిక అని అన్నారు. తన పేరుపై ఉన్న ఆస్తులు ట్రస్ట్‌కే చెందుతాయని ప్రకటించారు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో కొంత భాగాన్ని సమాజ సేవకు కేటాయించాలని పిలుపునిచ్చారు. ఒకప్పుడు ఉత్తర్‌ప్రదేశ్ దేశంలో చాలా వెనుకబడిన ప్రాంతంగా ఉండేదని, యోగి ఆదిత్యనాథ్ పాలనలో ఉత్తర్‌ప్రదేశ్ 'ఉత్తమప్రదేశ్'గా మారుతోందని ప్రశంసించారు.

గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ, పేదలకు ఉచిత విద్య, వైద్యం అందిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు స్వర్ణభారత్ ట్రస్ట్ నిరంతరం కృషి చేస్తోందని మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ తెలిపారు. సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేసేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

**శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన యోగి :** రజతోత్సవ కార్యక్రమానికి ముందు అక్షర విద్యాలయ ప్రాంగణంలోని హెలిప్యాడ్ వద్ద యోగి ఆదిత్యనాథ్‌కు ట్రస్ట్ నిర్వాహకులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన సోమా సాంకేతిక శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న యువతతో మాట్లాడి వారి శిక్షణ, ఉపాధి అవకాశాల గురించి తెలుసుకున్నారు. ట్రస్ట్ ద్వారా అందిస్తున్న సాంకేతిక, నైపుణ్య శిక్షణ వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల స్కేటింగ్ ప్రదర్శనను ఆసక్తిగా వీక్షించారు. అక్షర విద్యాలయంలో విద్యార్థులకు అందుతున్న విద్య, వసతులను పరిశీలించి నిర్వహణను అభినందించారు.

కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మంత్రులు నారాయణ, సత్యకుమార్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

**2001లో సేవా సంకల్పంతో ప్రారంభం :** గ్రామీణ సాధికారత, వికాసం, సేవే పరమావధిగా మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు స్ఫూర్తితో 2001లో స్వర్ణభారత్ ట్రస్ట్ ఏర్పాటైంది. వెంకయ్యనాయుడు మిత్రులు ఎనిమిది మంది మాతృభూమికి సేవ చేయాలనే సంకల్పంతో ట్రస్ట్‌ను ప్రారంభించారు. నెల్లూరు జిల్లా వెంకటాచలంలో ఏర్పాటైన ట్రస్ట్ కార్యకలాపాలు క్రమంగా విస్తరించాయి. విజయవాడ సమీపంలోని ఆత్కూరు, హైదరాబాద్‌లోని ముచ్చింతల్ ప్రాంతాల్లోనూ శాఖలను ఏర్పాటు చేసి విద్య, నైపుణ్య శిక్షణ, వైద్యం, ఉపాధి కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

రాజకీయాలకు అతీతంగా, ప్రభుత్వాల నుంచి నిధులు, సహాయాన్ని ఆశించకుండా భావసారూప్యం కలిగిన వ్యక్తులు, సంస్థల సహకారంతో ట్రస్ట్ తన కార్యక్రమాలను కొనసాగిస్తోంది. పాతికేళ్ల ప్రస్థానంలో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన లక్షలాది మంది పేదలు, మహిళలు, రైతులు, గ్రామీణ యువతకు వివిధ సేవలను అందించింది. విద్యార్థులు, యువతకు నైపుణ్య శిక్షణ, గ్రామీణ మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ, పేదలకు ఉచిత విద్య, వైద్యం అందించడం వంటి కార్యక్రమాలను కొనసాగిస్తోంది. ప్రస్తుతం కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ట్రస్ట్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు.

# పార్టీయే సుప్రీం.. పార్టీ ఆదేశాలకే ప్రాధాన్యం ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబు బీ–ఫారం ఇవ్వకపోతే మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా పోటీ చేసే అవకాశం ఉండదనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని అన్నారు. పార్టీ నిర్ణయాలు, పార్టీ వ్యవస్థకు గౌరవం ఇవ్వడం ప్రతి నాయకుడి బాధ్యతగా పేర్కొన్నారు.

**పార్టీని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు ఉండదు :** పార్టీని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో రాజకీయంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని లోకేశ్ హెచ్చరించారు. ప్రతి క్షణం పార్టీ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పనిచేయాలని సూచించారు. ఆయా నియోజకవర్గాల్లో పార్టీ కార్యక్రమాలు ఏ విధంగా జరుగుతున్నాయో నిరంతరం సమీక్షించుకోవాలని, పార్టీ క్యాడర్‌తో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యేలకు సూచించారు.

పార్టీ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు మై–టీడీపీ యాప్‌లో పార్టీ కార్యక్రమాల వివరాలను పూర్తిగా అప్‌డేట్ చేస్తున్నామని లోకేశ్ వెల్లడించారు. నియోజకవర్గాల వారీగా నిర్వహిస్తున్న పార్టీ కార్యక్రమాలు, కార్యకర్తల భాగస్వామ్యం తదితర అంశాలను యాప్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. యాప్‌లోని సమాచారాన్ని ఆధారంగా చేసుకుని పార్టీ కార్యక్రమాల నిర్వహణపై ఎప్పటికప్పుడు సమీక్ష చేసుకోవాలని సూచించారు.

**కార్యకర్తలకు ప్రాధాన్యం :** పార్టీని బలోపేతం చేయడంలో కార్యకర్తల పాత్ర కీలకమని లోకేశ్ పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిరంతరం అందుబాటులో ఉంటూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాలతో పాటు పార్టీ కార్యక్రమాలకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. పార్టీ వ్యవస్థ బలంగా ఉంటేనే ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత సమర్థవంతంగా తీసుకెళ్లగలమని పేర్కొన్నారు.

రెండు రోజుల శిక్షణ తరగతుల్లో ఎమ్మెల్యేలకు పార్టీ సంస్థాగత వ్యవహారాలు, నియోజకవర్గాల్లో పార్టీ కార్యక్రమాల నిర్వహణ, క్యాడర్‌తో సమన్వయం, పార్టీ ఆదేశాల అమలు తదితర అంశాలపై లోకేశ్ దిశానిర్దేశం చేశారు.

# పశ్చిమ చిత్తూరుకు 'అమరజీవి జలధారలు'

(మొదటి పేజీ తరువాయి)

పూర్తి చేయాల్సిన పనులను నెలవారీ, వారాల వారీ లక్ష్యాలుగా విభజించుకుని, ఎప్పటికప్పుడు పురోగతిని సమీక్షించాలని సూచించారు.

జల్ జీవన్ మిషన్–అమరజీవి జలధారల కింద రూ. 2,370 కోట్లతో చేపట్టిన చిత్తూరు మల్టీ విలేజ్ స్కీమ్ పనుల పురోగతిపై ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు నిర్మాణం, పైప్‌లైన్ పనులకు వివిధ శాఖల నుంచి పొందాల్సిన అనుమతులు, ఇతర సాంకేతిక అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. పనులను వేగంగా పూర్తి చేసి గడువులోగా ప్రజలకు తాగునీటిని అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు.

**18 మండలాలు.. 3,163 ఆవాసాలు :** ప్రతి గ్రామానికి స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన జల్ జీవన్ మిషన్ సంకల్పాన్ని రాష్ట్రంలో అమరజీవి జలధారల రూపంలో ముందుకు తీసుకువెళ్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. అత్యంత నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తోంది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసి 2024తో ముగిసిన జల్ జీవన్ మిషన్ గడువును 2028 వం–కు పొడిగించేందుకు చర్యలు తీసుకుంది. జల్ జీవన్ మిషన్ 2. 0 కింద రాష్ట్రంలో



దాదాపు రూ. 26 వేల కోట్ల విలువైన తాగునీటి ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళ్తున్నారు. ఇందులో తొలి విడతగా రూ. 7,910 కోట్లతో ఐదు జిల్లాల్లో చేపట్టిన ఐదు మెగా వాటర్ గ్రిడ్ పథకాల్లో చిత్తూరు ప్రాజెక్టు కూడా ఒకటిగా ఉంది.

**గండికోట, వెలిగల్లు జలాశయాల నుంచి నీటి సరఫరా :** ఉమ్మడి చిత్తూరు జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజలకు శాశ్వత తాగునీటి భద్రత కల్పించేందుకు జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధార నిధులతో రూ. 2,370 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రతిష్ఠాత్మక పథకాన్ని చేపట్టారు. గండికోట, వెలిగల్లు జలాశయాలను నీటి వనరులుగా వినియోగిస్తూ ప్రాజెక్టును అమలు చేస్తున్నారు.

ఈ పథకం ద్వారా మూడు నియోజకవర్గాల పరిధిలోని 18 మండలాల్లో ఉన్న 3,163 ఆవాసాలకు శుద్ధి చేసిన తాగునీటిని సరఫరా చేయనున్నారు. దాదాపు 25 లక్షల మంది ప్రజలకు ఈ ప్రాజెక్టు ద్వారా ప్రయోజనం కలగనుంది. ముఖ్యంగా వేసవి కాలంలో తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొనే పశ్చిమ ప్రాంత గ్రామాలకు ఈ పథకం కీలకంగా మారనుంది.

**కీలక నిర్మాణాలు పురోగతిలో :** చిత్తూరు మల్టీ విలేజ్ తాగునీటి పథకంలో భాగంగా గండికోట వద్ద ఒక ఇంటేక్ వెల్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. నాలుగు రా వాటర్ సంపులు నిర్మించాల్సి ఉండగా, వాటిలో మూడు పనులు శరవేగంగా సాగుతున్నాయి. నీటిని నిల్వ చేసి సరఫరా చేసేందుకు అవసరమైన గ్రౌండ్ లెవల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల నిర్మాణ పనులు కూడా వివిధ దశల్లో కొనసాగుతున్నాయి.

గుర్రంకొండ వద్ద రోజుకు 75 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో ఒక నీటి శుద్ధి కేంద్రాన్ని, వెలిగల్లు వద్ద రోజుకు 26 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో మరో నీటి శుద్ధి కేంద్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ శుద్ధి కేంద్రాల ద్వారా జలాశయాల నుంచి సేకరించిన నీటిని శుద్ధి చేసి ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించనున్నారు.

**130 కిలోమీటర్ల పైప్‌లైన్ పూర్తి :** ప్రాజెక్టులో భాగంగా ఏడు నీటి సంపులు, ఐదు ఓవర్‌హెడ్ ట్యాంకులు, 14 గ్రౌండ్ లెవల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు సహా మొత్తం 167 పనులు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. ప్రధాన నీటి వనరుల నుంచి గ్రామాలకు నీటిని తరలించేందుకు చేపట్టిన పైప్‌లైన్ పనుల్లో ఇప్పటివరకు సుమారు 130 కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మాణం పూర్తయింది.

మిగిలిన పనులను కూడా లక్ష్యాల మేరకు వేగవంతం చేసి పూర్తి చేయాలని అధికారులు చర్యలు చేపడుతున్నారు. ప్రాజెక్టు పూర్తయిన తర్వాత నీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా వ్యవస్థ మరింత మెరుగుపడనుంది.

**నాణ్యతకు ప్రాధాన్యం :** జల్ జీవన్ మిషన్–అమరజీవి జలధారల కింద చేపడుతున్న నిర్మాణ పనుల్లో నాణ్యతా లోపాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలం మన్నికగా ఉండేలా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.

ప్రాజెక్టు పనులకు అవసరమైన అనుమతులు, శాఖల మధ్య సమన్వయం, భూసేకరణ, పైప్‌లైన్ నిర్మాణం వంటి అంశాల్లో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. నిర్దేశిత లక్ష్యాలను వారాల వారీగా పర్యవేక్షిస్తూ పనుల వేగాన్ని మరింత పెంచాలని సూచించారు.

పశ్చిమ చిత్తూరు ప్రాంతంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు, లక్షలాది ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించే కీలక ప్రాజెక్టుగా అమరజీవి జలధారలు నిలవనున్నాయి.

## ఏపీ వక్ఫ్ బోర్డు డిజిటల్ పాలనలో మరో ముందడుగు



- త్వరలో వెబ్‌సైట్, మొబైల్ యాప్ ప్రారంభం
- సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు
- ఇన్‌స్పెక్టర్ ఆడిటర్లు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ
- కొత్త వ్యవస్థను ప్రారంభించడమే కాదు.. క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలి
- ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డును ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దే దిశగా మరో కీలక ముందడుగు పడిందని ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. బోర్డు సేవలు, కార్యకలాపాలను డిజిటలైజ్ చేసేందుకు ప్రత్యేకంగా వెబ్‌సైట్, మొబైల్ యాప్ రూపొందించామని, త్వరలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అధికారికంగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు కార్యాలయంలో సీఈఓ యాకూబ్ ఖాజీ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ ఆడిటర్లు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభంలో చైర్మన్ అబ్దుల్ అజీజ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొని సందేశం అందించారు. చైర్మన్ మాట్లాడుతూ, కొత్త వ్యవస్థను ప్రారంభించడం ఒక్కటే కాదని, దాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడం కూడా అంతే ముఖ్యమని అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. ఈ డిజిటల్ మార్పులో క్షేత్రస్థాయి సిబ్బంది పాత్ర కీలకమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కొనసాగుతున్న డిజిటల్ గవర్నెన్స్‌కు అనుగుణంగా వక్ఫ్ బోర్డులోనూ ఆధునిక సాంకేతిక విధానాలను అమలు చేస్తున్నామని తెలిపారు. అధికారిక ప్రారంభానికి ముందే సిబ్బందిని కొత్త వ్యవస్థ వినియోగానికి సిద్ధం చేస్తున్నామని, తద్వారా పరిపాలనలో పారదర్శకత, వేగం, జవాబుదారీతనం మరింత పెరుగుతాయని పేర్కొన్నారు. చైర్మన్ సందేశం అనంతరం ప్రాక్టికల్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రత్యేకంగా రాజుణ స్క్రీన్ ఏర్పాటు చేసి, వెబ్‌సైట్, మొబైల్ యాప్ వినియోగాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించారు. లాగిన్, సమాచార నమోదు, ఇప్పటికే ఉన్న వివరాల పరిశీలన, అప్‌డేషన్, క్షేత్రస్థాయి సమాచారాన్ని డిజిటల్ వ్యవస్థలో పొందుపరిచే విధానాలను దశలవారీగా వివరించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఆడిటర్లు, సిబ్బంది లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో డీఈఈ అబ్దుల్ ఖాదిర్ పాల్గొన్నారు.

## ఇండోర్ స్టేడియంలోని షటిల్ కోర్టుకు ఫ్లోర్ మ్యాట్ ఏర్పాటు చేయాలి



**రాజంపేట (జర్నలిస్ట్ ఫైల్)**: పట్టణంలోని ఇండోర్ స్టేడియం షటిల్ కోర్టులో నాణ్యమైన ఫ్లోర్ మ్యాట్ ఏర్పాటు చేయాలని రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్ఎస్‌యూ) జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో డీఆర్ఓ మల్లికార్జున్‌కు ఆర్ఎస్‌యూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఇండోర్ స్టేడియానికి ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువత క్రీడల కోసం వస్తున్నారని, షటిల్ కోర్టులో సరైన ఫ్లోర్ మ్యాట్ లేకపోవడంతో ఆటలు ఆడే సమయంలో కాళ్లకు నొప్పులు రావడంతో పాటు గాయాల బారిన పడే పరిస్థితి ఉందని తెలిపారు.

క్రీడలను ప్రోత్సహించడం ద్వారా విద్యార్థులు, యువత శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం కలుగుతుందని రాఘవేంద్ర పేర్కొన్నారు. క్రీడాకారులకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి రాజంపేట ఇండోర్ స్టేడియంలోని షటిల్ కోర్టులో నాణ్యమైన ఫ్లోర్ మ్యాట్ ఏర్పాటు చేసి మెరుగైన క్రీడా సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు జస్వంత్ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి వంశీ తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణగ్రామం-స్వర్ణ వార్డు శాఖను రద్దు చేసి ఉద్యోగులను ప్రభుత్వ శాఖల్లో విలీనం చేయాలి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)**: గ్రామ వార్డు ఉద్యోగులు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న అనిశ్చిత పరిస్థితులకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామ వార్డు సచివాలయం ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ మహమ్మద్ జానిపాషా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల అంకమ్మరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.15 లక్షల మంది స్వర్ణగ్రామం, స్వర్ణ వార్డు ఉద్యోగులు భవిష్యత్తుపై ఆందోళనతో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. స్వర్ణగ్రామం--స్వర్ణ వార్డు శాఖను రద్దు చేసి, వివిధ ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను గుర్తించి కామన్ పూల్‌లోకి తీసుకురావాలని, ఉద్యోగులకు వన్‌టైమ్ ఆప్షన్ కల్పించి విద్యార్హతలు, సాంకేతిక అర్హతలు, సేవా అనుభవం ఆధారంగా శాశ్వతంగా విలీనం చేయాలని కోరారు. విలీనంలో సీనియారిటీ, సేవా హక్కులు, వేతన ప్రయోజనాలకు పూర్తి రక్షణ కల్పించాలని అన్నారు.

పెండింగ్‌లో ఉన్న నోషనల్ ఇన్‌క్రిమెంట్లను వెంటనే విడుదల చేయడంతో పాటు ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్‌ను అమలు చేయాలని, స్వర్ణ ఉద్యోగుల క్యాడర్‌ను జూనియర్ అసిస్టెంట్ క్యాడర్‌గా మార్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లపై తక్షణమే సానుకూల నిర్ణయం తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులను ఏకం చేసి రాష్ట్రస్థాయి ఉద్యమానికి శ్రీకారం చుడతామని ఫెడరేషన్ హెచ్చరించింది. ఉద్యోగుల భవిష్యత్తును కాపాడేలా శాశ్వత విలీన ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని రాష్ట్ర అధ్యక్షుడు షేక్ మహమ్మద్ జానిపాషా, ప్రధాన కార్యదర్శి బత్తుల అంకమ్మరావు, రాష్ట్ర కమిటీ కోరింది.

# మెగా డీఎస్సీపై ఆరోపణలు అవాస్తవం

(మొదటి పేజీ తరువాయి)

నిబంధనలు, సంబంధిత సంస్థల ధ్రువీకరణల ఆధారంగా ఆరోపణలకు కేసుల వారీగా వివరణ ఇచ్చారు.

మెగా డీఎస్సీ-2025లో టెట్, విద్యార్హతలు, కేటగిరీ, క్రీడా అర్హతలను సంబంధిత నిబంధనలు, అధికారిక రికార్డులు, ధ్రువీకరణల ఆధారంగా పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. ఏదైనా ధ్రువపత్రం నకిలీదని లేదా అర్హత నిబంధనలకు విరుద్ధంగా ఉందని విచారణలో నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అదే సమయంలో కేవలం ఆరోపణల ఆధారంగా అర్హులైన అభ్యర్థులకు అన్యాయం జరగకుండా ప్రతి కేసును అధికారిక ఆధారాల ఆధారంగా నిష్పక్షపాతంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

**టెట్ అర్హతకు స్పష్టమైన నిబంధనలు** : భారత ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు ఉపాధ్యాయ నియామకాలకు టెట్‌ను ముఖ్యమైన అర్హతగా నిర్దేశించినట్లు విద్యాశాఖ కమిషనర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో టెట్ అమలుకు జీవోఎంఎస్ నంబర్ 51, తేదీ 16-04-2011 ద్వారా మార్గదర్శకాలు జారీ అయ్యాయని పేర్కొన్నారు.

టెట్‌లో ఓసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 60 శాతం అంటే 90 మార్కులు, బీసీ అభ్యర్థులకు 50 శాతం అంటే 75 మార్కులు, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ, మాజీ సైనికుల అభ్యర్థులకు 40 శాతం అంటే 60 మార్కులు కనీస అర్హతగా ఉన్నాయని వివరించారు. ఉపాధ్యాయ నియామకాల్లో టెట్ మార్కులకు 20 శాతం, ఉపాధ్యాయ నియామక పరీక్ష రాత పరీక్షకు 80 శాతం వెయిటేజీ ఆధారంగా మెరిట్ రూపొందుతుందని తెలిపారు.

అయితే శారీరక విద్యా ఉపాధ్యాయుడు, పాఠశాల సహాయకుడు--శారీరక విద్య, శారీరక విద్యా సంచాలకుడు, పీజీటీ, ప్రధానోపాధ్యాయుల పోస్టులకు ప్రత్యేక టెట్ అర్హత వర్తించదని స్పష్టం చేశారు.

**ఎడిగా ప్రభాకర్‌పై విచారణ కొనసాగింపు** : కర్నూలుకు చెందిన ఎడిగా ప్రభాకర్ క్రీడా డీఎస్సీ-2025లో హాకీ విభాగంలో క్రీడా కోటా ద్వారా ఎస్‌జీటీ పోస్టుకు ఎంపికయ్యారు. ఆయనకు నిర్దేశిత టెట్ మార్కులు లేవన్న ఆరోపణలు వచ్చాయి. అయితే అధికారిక రికార్డుల ప్రకారం ఆయన టెట్ పరీక్షలకు హాజరై, 2018లో పేపర్-2బీలో 77 మార్కులు సాధించినట్లు అధికారులు తెలిపారు.

ఈ వ్యవహారంపై ఇప్పటికే విచారణ కొనసాగుతోందని, విచారణ కమిటీ నివేదిక ఆధారంగా నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

**జంపాల ఉషకు టెట్ అర్హత** : కర్నూలుకు చెందిన బీసీ-ఏ కేటగిరీ అభ్యర్థి జంపాల ఉషకు టెట్ అర్హత లేదన్న ఆరోపణలపైనా అధికారులు వివరణ ఇచ్చారు. 2011 నుంచి 2017 మధ్య భాషా ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక పేపర్-2 ఉండేది కాదని, అభ్యర్థులు గణితం--సైన్స్ లేదా సామాజిక శాస్త్రాల విభాగాల్లో పేపర్-2 పరీక్ష రాసేవారని తెలిపారు.

ఆ సమయంలో బీసీ అభ్యర్థులకు 50 శాతం అంటే 75 మార్కులు ఉత్తీర్ణత ప్రమాణంగా ఉండేదన్నారు. జంపాల ఉష 2012 జనవరి, మే నెలల్లో వరుసగా 79, 80 మార్కులు, 2017లో 76 మార్కులు సాధించినట్లు రికార్డులు చూపిస్తున్నాయని తెలిపారు. అప్పటి నిబంధనల ప్రకారం ఆమె టెట్ అర్హతను సంతృప్తి పరిచినట్లు స్పష్టం చేశారు.

**మిరియాల గాయత్రి సాయి శ్రీకి అర్హత** : తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఓసీ కేటగిరీ అభ్యర్థి మిరియాల గాయత్రి సాయి శ్రీకి టెట్ అర్హత లేదన్న ఆరోపణ కూడా నిర్ధారణ కాలేదని అధికారులు తెలిపారు. ఓసీ అభ్యర్థులకు 90 మార్కులు కనీస అర్హత కాగా, ఆమె 2024లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష పేపర్-2ఏ, పాఠశాల సహాయకుడు--తెలుగు విభాగంలో 97.89 మార్కులు సాధించినట్లు వివరించారు.

అనంతరం క్రీడా కోటాలో పాఠశాల సహాయకుడు-తెలుగు పోస్టుకు ఎంపికై తూర్పుగోదావరి జిల్లాలో నియమితులయ్యారని తెలిపారు.

**క్రీడా కోటా జాబితాపై ఫిర్యాదుల పరిశీలన** : క్రీడా కోటాకు సంబంధించి 2025 ఆగస్టు 8 నుంచి 14 వరకు తాత్కాలిక క్రీడా కోటా జాబితాను ప్రచురించి,




అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరించేందుకు అవకాశం కల్పించినట్లు శాప్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ భరణి తెలిపారు. అనంతరం వచ్చిన ఫిర్యాదులను కూడా పరిశీలించినట్లు చెప్పారు.

క్రీడా డీఎస్సీకి సంబంధించి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో 69 రిట్ పిటిషన్లు దాఖలైనప్పటికీ, అవి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జూడో సంఘం జారీ చేసిన జూడో ధ్రువపత్రాలు నకిలీవా, అసలైనవా అనే అంశానికి సంబంధించినవి కావని ఆమె స్పష్టం చేశారు.

అయితే ఆంధ్రప్రదేశ్ జూడో సంఘం జారీ చేసిన ధ్రువపత్రాల ప్రామాణికతపై ప్రజా ప్రయోజన వ్యాజ్యం నంబర్ 170, తేదీ 23--07-2026 ద్వారా హైకోర్టు పరిశీలన కొనసాగుతోందని తెలిపారు. 2017 నుంచి విజిలెన్స్ శాఖకు ఫిర్యాదులు అందినట్లు వ్యాజ్యంలో పేర్కొన్నారని వివరించారు.

ఈ నేపథ్యంలో విచారణ పూర్తి చేసి నివేదికను కోర్టుకు సమర్పించాలని హైకోర్టు విజిలెన్స్ శాఖను ఆదేశించిందన్నారు. అందువల్ల తుది నిర్ణయం విచారణ ఫలితాల ఆధారంగానే ఉంటుందని తెలిపారు.

**క్రీడా ధ్రువపత్రాలకు అధికారిక సంస్థల ధ్రువీకరణ** : కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం క్రీడాకారుల నియామకాల్లో సంబంధిత క్రీడా విభాగానికి చెందిన అధికారిక సంస్థలు జారీ చేసిన ధ్రువపత్రాలను పరిగణనలోకి తీసుకుంటారని భరణి తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు సంబంధిత జాతీయ సమాఖ్య లేదా రాష్ట్ర సంఘం, అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు సంబంధిత విశ్వవిద్యాలయం, పాఠశాల క్రీడలకు సంబంధిత విద్యాశాఖ లేదా క్రీడా అధికారి, ఖేలో ఇండియా క్రీడలకు భారత క్రీడా ప్రాధికార సంస్థలో నియమిత అధికారి ధ్రువీకరణలు జారీ చేసే అధికారం కలిగి ఉంటారని వివరించారు.

**జూడో క్రీడాకారులపై విజిలెన్స్ విచారణ** : 21 మంది అభ్యర్థులు ఒకే క్రీడా విభాగమైన జూడోకు చెందినవారని, ఒకే మండలానికి చెందినవారని, వారిలో ఏడుగురు ఒకే కుటుంబానికి చెందినవారని ఆరోపణలు వచ్చాయని భరణి తెలిపారు.

సంబంధిత క్రీడా ధ్రువపత్రాల ప్రామాణికతపై ప్రస్తుతం విజిలెన్స్ విచారణ కొనసాగుతోందని, విచారణ పూర్తయి వాస్తవాలు నిర్ధారణ అయిన తర్వాతే తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఒక క్రీడాకారుడు తప్పనిసరిగా తన స్వస్థల జిల్లానే ప్రాతినిధ్యం వహించాలనే నిబంధన లేదని ఆంధ్రప్రదేశ్ జూడో సంఘం తన లేఖలో స్పష్టం చేసిందన్నారు. ప్రస్తుతం చదువుతున్న లేదా పనిచేస్తున్న జిల్లాకు కూడా క్రీడాకారుడు ప్రాతినిధ్యం వహించవచ్చని సంఘం పేర్కొన్నట్లు తెలిపారు.

**భార్యాభర్తల జూడో సర్టిఫికెట్లపై వివరణ**: నొస్సం కరిష్మా, షేక్ ఇమామ్ హుస్సేన్ భార్యాభర్తలు ఇద్దరూ క్రీడా కోటాలో ఉపాధ్యాయ పోస్టులకు ఎంపిక కావడం, వారి జూడో ధ్రువపత్రాలపై సందేహాలు వ్యక్తం కావడంపై కూడా అధికారులు వివరణ ఇచ్చారు.

ఇద్దరూ 2014 నవంబర్ 11 నుంచి 13 వరకు విజయవాడలో జరిగిన సీనియర్ అంతర్ జిల్లా జూడో పోటీల్లో రెండో స్థానం సాధించినట్లు రికార్డులు ఉన్నాయని తెలిపారు. భార్యాభర్తలు అయినప్పటికీ పురుషులు, మహిళల వేర్వేరు విభాగాల్లో, వేర్వేరు బరువు కేటగిరీల్లో పోటీ చేసినందున వారి క్రీడా ప్రతిభను విడివిడిగా పరిగణించాల్సి ఉంటుందని వివరించారు.

క్రీడా పోటీలో పాల్గొనేందుకు తప్పనిసరిగా విద్యాసంస్థలో నమోదు అయి ఉండాలనే నిబంధన లేదని తెలిపారు. 2014లో షేక్ ఇమామ్ హుస్సేన్ కర్ణాటకలో బీఈడీ చదువుతున్నప్పటికీ, తన స్వస్థల వివరాల ఆధారంగా కర్నూలు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తూ ఆంధ్రప్రదేశ్ తరఫున పోటీలో పాల్గొన్నట్లు వివరించారు.

**పెద్ద అప్పలరాజు బాక్సింగ్ సర్టిఫికెట్ వివాదం** : పెద్ద అప్పలరాజు విషయంలో మొదట పొరపాటున తన సోదరుడి క్రీడా ధ్రువపత్రాన్ని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారన్న ఆరోపణ వచ్చిందని అధికారులు తెలిపారు. అయితే దరఖాస్తుల్లో తప్పులను సరిచేసుకునేందుకు చివరి దశలో అదనపు సమయం ఇచ్చిన సమయంలో ఆయన తన జాతీయ ఛాంపియన్‌షిప్ ధ్రువపత్రాన్ని ప్రత్యామ్నాయ ధ్రువపత్రంగా అప్‌లోడ్ చేశారని వివరించారు. భౌతిక ధ్రువీకరణ సమయంలో కూడా అదే ధ్రువపత్రాన్ని సమర్పించినట్లు తెలిపారు.

2023లో గోవాలో జరిగిన 37వ జాతీయ క్రీడల రికార్డుల్లో 'పాండా'గా పేరు నమోదైన అంశంపైనా వివరణ ఇచ్చారు. అసలు ధ్రువపత్రంలో అభ్యర్థి పేరు 'పెద్ద అప్పలరాజు'గానే ఉందని స్పష్టం చేశారు.

**కొనడ పద్మజ అథ్లెటిక్స్ ధ్రువపత్రం చెల్లుబాటు** : శ్రీకాకుళం జిల్లాకు చెందిన కొనడ పద్మజ 2021లో జరిగిన ఆంధ్రప్రదేశ్ సీనియర్ అంతర్ జిల్లా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొని రెండో స్థానం సాధించిన అంశంపై ఆమె వయస్సు, గత క్రీడా రికార్డులపై సందేహాలు వ్యక్తమైనట్లు అధికారులు తెలిపారు.

అయితే అందుబాటులో ఉన్న అధికారిక రికార్డులు, సంబంధిత అథ్లెటిక్స్ సంఘం సమర్పించిన ధ్రువీకరణ పత్రం ఆధారంగా ఆమె క్రీడా విజయాన్ని చెల్లుబాటు అయ్యేదిగా పరిగణించినట్లు వివరించారు. 2025 ఏప్రిల్ 19న జారీ చేసిన జీవోఎంఎస్ నంబర్ 4లోని వర్తించే నిబంధనల ప్రకారం ఆమెను పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిపారు.

**సాఫ్ట్‌బాల్ ధ్రువపత్రాలపైనా స్పష్టత** : శ్రీకాకుళం జిల్లాకు సంబంధించిన సాఫ్ట్‌బాల్ ధ్రువపత్రాలపై కూడా అభ్యంతరాలు వ్యక్తమైనట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా ఫారం-2ను సంబంధిత సంఘం అధ్యక్షుడు జారీ చేయగలరా అనే అంశంపై సందేహాలు వచ్చాయని వివరించారు.

ఈ నేపథ్యంలో క్రీడాకారుల ప్రయోజనాలను కాపాడే ఉద్దేశంతో కూన రవి కుమార్‌కు ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్‌బాల్ సంఘం తరఫున క్రీడా ధ్రువపత్రాలను పరిశీలించే అధికారం ఇచ్చినట్లు భారత సాఫ్ట్‌బాల్ సంఘం శాప్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌కు పంపిన లేఖలో పేర్కొన్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్‌బాల్ సంఘాన్ని 2026లో శాప్ గుర్తించినట్లు కూడా వివరించారు.

**ఈడబ్ల్యూఎస్ ధ్రువపత్రాల ఆధారంగానే ఎంపిక** : ఓసీ-ఈడబ్ల్యూఎస్ కేటగిరీపై వచ్చిన ఆరోపణల విషయంలో సంబంధిత సమర్థ అధికారి జారీ చేసిన ఈడబ్ల్యూఎస్ ధ్రువపత్రాల ఆధారంగానే నియామకాలు చేపట్టినట్లు భరణి తెలిపారు. ఇటువంటి సందర్భాల్లో వ్యక్తిగత ప్రకటనల ఆధారంగా కాకుండా సమర్థ అధికారి జారీ చేసిన అధికారిక ధ్రువీకరణ పత్రాల ఆధారంగా నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు.

మెగా డీఎస్సీ-2025 నియామక ప్రక్రియలో పారదర్శకత, నిబంధనల అమలు, అధికారిక ఆధారాల పరిశీలనకే ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇచ్చిందని విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా, శాప్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ భరణి తెలిపారు. విచారణలో ఏదైనా అక్రమం నిర్ధారణ అయితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని, అర్హులైన అభ్యర్థులకు అన్యాయం జరగకుండా ప్రతి అంశాన్ని అధికారిక ఆధారాలతో పరిశీలిస్తున్నామని స్పష్టం చేశారు.

## అక్టోబర్‌లో పిఎం కుసుమ్ ప్రాజెక్టులు ప్రారంభం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** : పిఎం కుసుమ్ ప్రాజెక్టులు అక్టోబర్‌లో ప్రారంభించడమే లక్ష్యంగా పనులు వేగవంతం చేయాలని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ అన్నారు. పిఎం కుసుమ్‌పై సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ ప్రాజెక్టులను నిర్ణీత కాలపరిమితిలోగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 228 ఫీడర్ స్థాయి సౌరప్లాంట్లకు భూసేకరణ పూర్తయిందని, సివిల్ పనులు, పరికరాల సేకరణ, ఫైనాన్షియల్ క్లోజర్ , చట్టబద్ధమైన పత్రాల ప్రక్రియాలను పర్యవేక్షించాలని చెప్పారు. ఎస్పిడిసిఎల్‌లో 191.5 మెగావాట్ల ఉమ్మడి సామర్థ్యంతో 49 ఎఫ్ఎల్ఎస్ ప్లాంట్లు అమల్లో ఉన్నాయని తెలిపారు. ఇపిడిసిఎల్ ,ఎస్పిడిసిఎల్ పరిధిలో 19.9 మెగావాట్లు, 11.99 మెగావాట్లు చొప్పున సెప్టెంబర్‌లో, ఇపిడిసిఎల్ పరిధిలో అక్టోబర్‌లో 13.5 మెగావాట్లు ప్రారంభించేందుకు ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. ఈ రెండు నెలల్లో 109.7మెగావాట్లు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ సమీక్షలో డిస్కంల సిఎండిలు శివశంకర్, పృథ్వీతేజ్, పి పుల్లారెడ్డి, నెడ్‌క్యాప్ ఎండి కమలాకర్ బాబు తదితరులు పాల్గొన్నారు. అనంతపురంలోని జెఎన్‌టియు అనంతపురంలో రాష్ట్రంలోనే తొలిసారిగా భారీ స్థాయిలో ఎలక్ట్రిక్ కుకింగ్ డెమన్‌స్ట్రేషన్ ప్రాజెక్టు చేపడతున్నట్లు జెన్‌కో ఎండి ఎస్ నాగలక్ష్మీ వెల్లడించారు. జెఎన్‌యుటి, జెన్‌కో మధ్య అవగాహన ఒప్పందం విజయవాడలోని జెన్‌కో కార్యాలయంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా నాగలక్ష్మీ మాట్లాడుతూ జెఎన్‌టియు ప్రాంగణంలోని హంపీ హాస్టల్‌లో ఈ కుకింగ్ ప్రాజెక్టు అమలుకు బిఇఇ మార్గదర్శకాల మేరకు ఆమోదం పొందిందని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా వాణిజ్య స్థాయి ఎలక్ట్రిక్ వంట పరికరాల కొనుగోలు, ఏర్పాటు, పరీక్షలు పనుల కోసం ఈ ఆర్థిక సంవత్సరం ఎపిఎస్ఇసిఎం రూ. 81.80లక్షల సాయం మంజూరు చేసిందన్నారు. పరిశుభ్ర ఇంధన దిశగా ఎపి కీలక అడుగు వేస్తుందని అన్నారు. పర్యావరణహిత, సురక్షిత, తక్కువ ఖర్చుతో కూడిన ఎలక్ట్రిక్ వంటి సాంకేతికతను ప్రోత్సహించడంలో ఎపి ముందంజలో ఉందన్నారు.

## యజమానులను మాత్రమే బాధ్యులను చేయలేం!

**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్)** : దేశ రాజధానిలోని సత్యనికేతన్‌లో ఐదంతస్తుల హాస్టల్ భవనం కూలిన విషాద ఘటనకు కేవలం భవన యజమానులనే బాధ్యులను చేయలేమని, ఈ విషాదంలో ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌కు, ఢిల్లీ యూనివర్శిటీకీ కూడా బాధ్యత వుందని ఢిల్లీ హైకోర్టు పేర్కొంది. అత్యంత దురదృష్టకరమైన ఘటన అని వ్యాఖ్యానించింది. రాష్ట్ర ప్రభుత్వం, ఢిల్లీ యూనివర్శిటీ తగినన్ని హాస్టల్ సదుపాయాలు నిర్వహించకపోవడం, విద్యార్థుల భద్రత గురించి పట్టించుకోకపోవడం, అలాగే పిజిలు, హాస్టళ్ళను నియంత్రించేందుకు ఢిల్లీ కార్పొరేషన్, ఇతర అధికారులు సరైన చర్యలు తీసుకోకపోవడం వంటి అనేక తీవ్ర అంశాలను ఈ ఘటన లేవనెత్తిందని చీఫ్ జస్టిస్ డి.కె.ఉపాధ్యాయ, జస్టిస్ తేజాస్ కరియాలతో కూడిన డివిజన్ బెంచ్ పేర్కొంది. పదిరోజుల్లోగా ఢిల్లీ ప్రభుత్వం, కార్పొరేషన్, ఢిల్లీ యూనివర్శిటీ, ఢిల్లీ పోలీసులు వేర్వేరుగా తమ స్పందనలను తెలియచేయాలని బెంచ్ కోరింది. భవనం కూలిన ఘటనపై దాఖలైన ప్రజా ప్రయోజనాల పిటిషన్‌ను అత్యవసరంగా విచారించేందుకు ఢిల్లీ కోర్టు అంగీకరించింది.


**ఏడుకు చేరిన మృతుల సంఖ్య..** : ఈ ఘటనలో మరో ఇద్దరు చనిపోవడంతో మృతి చెందిన వారి సంఖ్య సోమవారం ఉదయానికి ఏడుకు పెరిగింది. కాగా 12మందిని శిథిలాల నుండి రక్షించారు. సోమవారంతో సహాయక చర్యలు ముగిశాయని ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి సౌత్ జోన్ డిప్యూటీ కమిషనర్ రాకేష్ కుమార్‌ను, నలుగురు ఇంజనీర్లను సస్పెండ్ చేసినట్లు ఢిల్లీ మేయర్ పర్వేష్ వహి తెలిపారు. ప్రైవేట్ హాస్టల్ కూలిన ఘటనలో భవన యజమాని హరిరామ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. హరిరామ్ గుప్తా (81), ఆయన భార్య ఊర్మిళా గుప్తా (75), కుమారుడు మహేష్ గుప్తా (52)లను రాజస్థాన్‌లోని భివాండిలో అరెస్టు చేశారు. వారిని విచారిస్తున్నారు. మరోపక్క పిజి నిర్వాహకులు, లేబర్ కాంట్రాక్టర్ కోసం గాలిస్తున్నారు. ఈ కేసులో వారి పాత్రను విచారించి, చర్యలు తీసుకుంటామని తెలిపారు. కూలిపోయిన భవనానికి ఆనుకుని వున్న భవనాన్ని కూడా కూల్చివేయాలని కార్పొరేషన్ ఆదేశించింది.

## డిజిటల్ లైంగిక వేధింపుల బారిన 2 కోట్ల మంది మైనర్లు

**జెనీవా** : ఏడాదిలో సుమారు 2కోట్ల మంది చిన్నారులు డిజిటల్ లైంగిక వేధింపుల బారిన పడినట్లు యునిసెఫ్ తెలిపింది. వీరంతా 12 నుండి 17ఏళ్ల లోపు వయస్సు వారేనని పేర్కొంది. "పిల్లల కళ్ళతో: డిజిటల్ సాంకేతికతలు పిల్లలపై లైంగిక వేధింపులకు ఎలా దారితీస్తాయి" అనే శీర్షికతో యునిసెఫ్ ఈ నివేదికను విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం.. 21 దేశాలలో ఒకే సంవత్సరంలో 12 నుండి 17 ఏళ్ల వయస్సు గల సుమారు 2 కోట్ల మంది పిల్లలు సాంకేతికత ఆధారిత (డిజిటల్ మాధ్యమాల ద్వారా) లైంగిక వేధింపుల బారిన పడినట్లు తెలిపింది. ఈ పరిశోధనల ప్రకారం, 1.5కోట్లమంది చిన్నారులు తమకు ఇష్టం లేకుండానే లైంగిక కంటెంట్‌ను పొందారని, 90 లక్ష?ల మంది తమ ఇష్టానికి వ్యతిరేకంగా లైంగిక సంభాషణలు లేదా చిత్రాల కోసం అభ్యర్థనలను అందుకున్నారని, సుమారు 40 లక్షల మంది లైంగిక చిత్రాలు వారి సమ్మతి లేకుండా పంపిణీ అయినట్లు వెల్లడైంది. సుమారు 60శాతం కేసుల్లో డిజిటల్ మాధ్యమాలైన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్, టిక్‌టాక్, వాట్సప్‌ల ద్వారా ఇటువంటి కంటెంట్‌ను పొందగా, సుమారు 14శాతం మంది ఆన్‌లైన్ గేమ్స్‌ల ద్వారా పొందినట్లు నివేదిక తెలిపింది. పిల్లల విశ్వాసాన్ని దుర్వినియోగం చేయడానికి ప్లాట్‌ఫామ్ ఫీచర్లు, డిజైన్స్ రూపొందించారని పేర్కొంది. 57 శాతం కేసుల్లో వేధింపులకు పాల్పడిన వారు ఆ పిల్లలకు అప్పటికే తెలిసిన వ్యక్తులైన ఇతర మైనర్లు, ప్రేమ సంబంధం ఉన్నవారు, స్నేహితులు లేదా కుటుంబ సభ్యులు అయి ఉన్నారని నివేదిక తెలిపింది. 38శాతం కేసుల్లో వేధింపులకు పాల్పడిన వ్యక్తితో మొదటి పరిచయం ఆన్‌లైన్‌లోనే జరిగిందని, ఇది తరచుగా నకిలీ ఖాతాలు, ప్రైవేట్ మెసేజింగ్ ఫీచర్ల ద్వారా జరిగినట్లు వెల్లడించింది.

## ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల విలీనం తప్పుడు నిర్ణయం : ఆర్‌బిఐ మాజీ గవర్నర్

**చెన్నై (జర్నలిస్ట్ ఫైల్)** : ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల (ఆర్ఆర్‌బిల) సంఖ్య తగ్గడంపై ఆర్‌బిఐ మాజీ గవర్నర్ సి.రంగరాజన్ ఆందోళన వ్యక్తం చేశారు. 'ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల విలీనం' తన దృష్టిలో కేంద్రం తీసుకున్న తప్పుడు నిర్ణయంగా ఆయన పేర్కొన్నారు. ఈచర్య స్థానిక, ప్రాంతీయ బ్యాంకుల స్వభావాన్ని దెబ్బతీసిందని, చివరికి అవి 'యూనివర్శల్ బ్యాంకు'ల్లో విలీనం కావడానికి దారితీయవచ్చని పేర్కొన్నారు. ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ 10వ వార్షికోత్సవం సందర్భంగా చెన్నైలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ తప్పుడు నిర్ణయంతో ఆర్ఆర్‌బిల సంఖ్య గణనీయంగా పడిపోయిందనది అన్నారు. స్థానికంగా గ్రామాల్లో రుణాలు మరింత సమానంగా పంపిణీ అవుతాయనే ఉద్దేశ్యంతోనే ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను (ఆర్ఆర్‌బి) ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే బలహీన వర్గాలకు రుణాలు అందించే విధానం పరిణామ క్రమంలో బ్యాంకుల జాతీయాకరణ, ప్రాధాన్యతా రంగ రుణాల కల్పన , ఆర్ఆర్‌బిలు, స్థానిక ప్రాంత బ్యాంకులు, స్వయం సహాయ సంఘాలు తదనంతరం చిన్న ఆర్థిక బ్యాంకుల వంటి అనేక సంస్థాగత చర్యలు కీలక పాత్ర పోషించాయని గుర్తు చేశారు.



రుణ అవసరాలను తీర్చడంలో ప్రస్తుతం ఉన్న చిన్న ఆర్థిక బ్యాంకుల సంఖ్య సరిపోదని రంగరాజన్ పేర్కొన్నారు. చిన్న ఆర్థిక బ్యాంకుల ఏర్పాటును ప్రోత్సహించే మార్గాలను పరిశీలించాలని ఆయన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ)ను కోరారు. ప్రస్తుతం కేవలం 11 చిన్న ఆర్థిక బ్యాంకులు మాత్రమే ఉన్నాయని, ఈ రంగంలో రుణ అవసరాలను తీర్చడానికి ఈ సంఖ్య ఏమాత్రం సరిపోదని ఆయన పేర్కొన్నారు. కేవలం మరిన్ని బ్యాంకులను ఏర్పాటు చేయడం ఒక్కటే పరిష్కారం కాదని, కొత్త సంస్థలు ఏర్పడినప్పటికీ సమస్యలు కొనసాగవచ్చని రంగరాజన్ పేర్కొన్నారు. ఆయా బ్యాంకుల యాజమాన్యం ఏ స్ఫూర్తితో, ఏ లక్ష్యంతో బాధ్యతలు చేపడుతుందన్నదే ముఖ్యమని అన్నారు. చిన్న ఆర్థిక బ్యాంకుల పనితీరు కూడా ఇదే విషయాన్ని రుజువు చేస్తోందని పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జి)ల పరిణామ క్రమం పట్ల కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. స్వయం సహాయక సంఘం అంటే ఏమిటనే దానిపై స్పష్టమైన నిర్వచనం లేకపోవడం మరియు అవి సొసైటీలుగా నమోదు కాకపోవడం వల్ల, ప్రారంభంలో బ్యాంకులు వాటికి రుణాలు ఇవ్వడానికి వెనుకాడేవని ఆయన గుర్తుచేశారు. దాదాపు ఉమ్మడి హామీ తరహా పద్ధతిలో స్వయం సహాయక సంఘాలకు రుణాలు మంజూరు చేయడానికి బ్యాంకులను అనుమతిస్తూ 1993 లేదా 1994లో తాను ఒక సర్క్యులర్ జారీ చేశానని ఆయన తెలిపారు. అయితే, ఆ తర్వాత స్వయం సహాయక సంఘాల పాత్ర మారిపోయిందని ఆయన పేర్కొన్నారు. కానీ వాస్తవానికి ఇప్పుడు స్వయం సహాయక సంఘాలు కేవలం ప్రభుత్వ పథకాలను అమలు చేసే 'సాధనాలు'గా మాత్రమే మారిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే స్వయం సహాయక సంస్థలను స్థాపించిన ఉద్దేశానికి, స్ఫూర్తికి ఇది పూర్తిగా విరుద్ధమని పేర్కొన్నారు.

గతేడాది జులైలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభకిచ్చిన లిఖిత పూర్వక సమాధానం ప్రకారం.. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల నిర్వహణ సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి, మరియు భారీ స్థాయి కార్యకలాపాల వల్ల కలిగే ప్రయోజనాలను పొందేందుకు, ప్రభుత్వం 2005 నుండి వాటిని దశలవారీగా విలీనం చేస్తూ వస్తోందని తెలిపారు. విలీన ప్రక్రియలో భాగంగా 2005-2010 మధ్య జరిగిన మొదటి దశలో, ఆర్ఆర్‌బిల సంఖ్య 196 నుండి 82కి తగ్గిందని, తదుపరి దశలలో ఈ సంఖ్య మరింత తగ్గిందని పేర్కొన్నారు. తాజాగా 'ఒక రాష్ట్రం-ఒక ఆర్ఆర్‌బి' విధానం కింద, మే 1, 2025 నుండి అమల్లోకి వచ్చేలా వీటి సంఖ్యను 43 నుండి 28కి తగ్గించారని తెలిపారు.

## గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులుగా పసుపు నూరి నాగభూషణం ఏకగ్రీవ ఎన్నిక..

– శుభాకాంక్షలు తెలిపిన పట్టణ ప్రముఖులు వ్యాపారస్తులు



యాదాద్రి భువనగిరి సెప్టెంబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) : భువనగిరి పట్టణ గణేష్ ఉత్సవ కమిటీ నూతన అధ్యక్షునిగా పసుపునూరి నాగభూషణంను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. భువనగిరి పట్టణ ఎం ఎస్ ఆర్ గార్డెన్ లో జరిగిన గణేష్ ఉత్సవ కమిటీ సమావేశంలో నాగభూషణంను ఏకంగా ఎన్ను కున్నారు. ఈ సందర్భంగా భువనగిరి పట్టణ మున్సిపల్ చైర్మన్ తంగెళ్లపల్లి శ్రీవాణి, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు నూతన అధ్యక్షులు పసుపునూరి నాగభూషణంను శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాభి నందనలు తెలిపారు. గణేష్ ఉత్సవ కమిటీ నూతన అధ్యక్షులుగా ఎన్నికైనటువంటి పసుపు నూరి నాగభూషణంని పట్టణంలోని ప్రముఖులు, వ్యాపారవేత్తలు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సభ్యులు, ప్రజా ప్రతినిధులు నాగభూషణం కుటుంబసభ్యులతోపాటు బంధుమిత్రులు కూడా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాగ భూషణం మాట్లాడుతూ నా ఎన్నికకు సహక రించిన మాజీ అధ్యక్ష కార్యదర్శులకు తో పాటు పట్టణ ప్రముఖులకు పేరు పేరునా ప్రత్యేక ధన్య వాదాలు తెలిపారు. నాపై నమ్మకంతో నాకు అప్పగించిన ఈ బాధ్యతను తూచా తప్పకుండా పాటిస్తానని మనసా వాచా కర్మేనా ఆ భగ వంతుని మీద ప్రమాణం చేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ పలు వినాయక మండ పాల అధ్యక్షులతో పాటు మాజీ ఉత్సవ కమిటీ అధ్యక్షులు కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## వినాయకుని కర్రపూజలో పాల్గొన్న సంగారెడ్డి ఎమ్మెల్యే కాంటెస్టెడ్ అభ్యర్థి పులిమామిడి రాజు



సదాశివపేట సెప్టెంబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) : సదాశివపేట పట్టణంలోని పాతకేరి ప్రాంతంలో శ్రీ మార్కండేయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయకుని కర్రపూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఇట్టి కార్యక్రమానికి సంగారెడ్డి ఎమ్మెల్యే కాంటెస్టెడ్ అభ్యర్థి పులిమామిడి రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పులిమామిడి రాజు వినాయకుని పూజా కార్యక్రమంలో పాల్గొని, వినాయకుని కర్రపూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం వినాయకుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. రానున్న వినాయక చవితి పండుగను సంగారెడ్డి నియోజక వర్గ ప్రజలు, యువకులు చిన్నలు, పెద్దలు, మహిళలు అందరూ భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని, ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ప్రతి ఒక్క వినాయక మండపం వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, నిమజ్జనం కూడా భక్తిభావంతో, భజనలతో, కోలాటాలతో, కళాకారులతో, సాంస్కృతిక ప్రదర్శనలతో, డప్పుచప్పుళ్లతో, మేళ తాళాలతో భక్తిపారవశ్యం ఉట్టి పడేలా ఉండాలని యువకులకు సూచించారు. ఎవ్వరు కూడా ప్రజలకు హాని కలిగించే విధంగా డీజేలను వినాయక మండపాల వద్ద గాని, ఊరేగింపులో గాని నిర్వహించకూడదని, దీనివలన ప్రజలకు హాని కలిగే అవకాశం ఉందని సంగారెడ్డి ఎమ్మెల్యే కాంటెస్ట్ అభ్యర్థి పులిమామిడి రాజు వినాయక మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులకు, కార్యక ర్తలకు పత్రికా ముఖంగా తెలియజేశారు. ఎవరైనా వినకుండా ప్రజలకు హాని కలిగే విధంగా డీజే లను ఏర్పాటు చేస్తే పోలీస్ శాఖ వారు సీజ్ చేస్తారని, ముందుగానే పోలీస్ శాఖవారు డీజే నిర్వా హకులకు ఇట్టి విషయాన్ని ముందుగానే తెలియజేయాలని అన్నారు. ఇట్టి కార్యక్రమంలో శ్రీఈశ్వర మార్కండేయ దేవస్థానం ఆలయ కమిటీ చైర్మన్ గుజ్జరి వెంకన్న బాబు(లడ్డు) మరియు డైరెక్టర్లు పద్మ మాణిక్యం, మాలె అనిత, పురోహితులు కేదార్నాథ్ స్వామి,శ్రీ మార్కండేయ యూత్ అసోసియేషన్ నిర్వాహకులు గుజ్జరి బాగప్ప, చిల్వేరి రవి, వెంకటేశం, తుల్జారాం పెయింటర్, రంగం పేట ఆంజనేయులు, పాలడుగు సత్యనారాయణ కార్యకర్తలు పోలసత్యం, నల్ల మహేష్, సిద్ధు, పోల గణేష్, భరత్, రామ క్రిష్ణ, బాను, యెన్నం లక్ష్మణ్, జగదీష్, నరేష్, సాయి, చింటు, అభినవ్, కిట్టు, రుమాండ్ల రాజు, సోమ శంకర్ మరియు భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తుల జైజై నినాదాలతో పాతకేరి ప్రాంతం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.

## జహీరాబాద్-బడెంపేట పాదయాత్రకు ఘనంగా సంఘీభావం



సదాశివపేట సెప్టెంబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) : జహీరాబాద్ నుండి బడెంపేట వరకు కొన సాగిన పాదయాత్రకు దారి మధ్యలో ష.బ్ర. 108 వీరేశ్వర శివాచార్య మహాస్వామి ధనసిరి ఆధ్వర్యం లో ఘనంగా సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జహీరాబాద్ యువజన నాయకులు శ్రీ సురేష్ షెట్కర్ ఆధ్వర్యంలో పాదయాత్రలో పాల్గొన్న వారికి పండ్లు, పాలు, మంచినీరు పంపిణీ చేశారు. పాదయాత్రికులకు అవసరమైన సేవలు అందిస్తూ కార్యక్రమానికి తమ మద్దతును తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా వీరశైవ లింగాయత్ సమాజం సలహాదారులు అన్మిశెట్టి జయప్రకాశ్, యువజన అధ్యక్షులు బుగ్గనగారి మల్లికార్జున్, వీరేశం, చంద్రకాంత్, నీలకంతప్ప, గుణాకర్, మల్లేశం, రోహిత్, శివరాజ్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. పాదయాత్రి కులకు సేవ చేయడం ద్వారా సమాజ ఐక్యత, భక్తి భావం,పరస్పర సహకారాన్ని చాటిచెప్పారని నిర్వాహకులు తెలిపారు.

## జిట్టా బాలకృష్ణారెడ్డి రెండో వర్ధంతి..



వలిగొండ సెప్టెంబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) : పట్టణ కేంద్రంలో జిట్టా అభిమానుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. తెలంగాణ ఉద్యమకారులు ఆల్ పార్టీ లీడర్స్ అభిమానులు భారీ ఎత్తున పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిట్టా అభిమానులు సత్తిరెడ్డి, బొల్లు శ్రీనివాస్, నానచర్ల రమేష్ , మస్కా నరసింహ, ఎండి సమ్మద్, కంకల శ్రీనివాస్, అంబటి మోహన్, లగోని వెంకటేశం, కొండూరు సత్తయ్య కొండూరు సురేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తిని సహదేవ్, మాజీ ఎంపీపీ బడుగు సత్యనారాయణ బిఆర్ఎస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ అప్రోజ్, తెలంగాణ ఉద్యమకారులు శీలం స్వామిబతిన్ రవీందర్, మారగోని శ్రీనివాస్, బీసీ సంఘం మండల అధ్యక్షుడు సాయిని యాదగిరి, సింగల్ విండో డైరెక్టర్ ఎమ్మె మల్లేష్, సింగల్ విండో మాజీ డైరెక్టర్ నరసింహ, కాంగ్రెస్ పార్టీ మాజీ టౌన్ ప్రెసిడెంట్ కంకల కిష్టయ్య, ఆల్ పార్టీ లీడర్స్ అభిమానులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

# సాహెబ్‌నగర్‌లో తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న మధుయాష్కి గౌడ్

- కులాన్ని, ఆత్మగౌరవాన్ని కించపరిస్తే ఎవరూ సహించకూడదని.. ఐక్యంగా ఎదుర్కోవాలని సూచన.
- తమ సాంప్రదాయాన్ని నృత్యాలతో ఆలరించిన బంజారా మహిళలు..



హైదరాబాద్, సెప్టెంబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) : ఎల్బీనగర్ నియోజకవర్గంలో బంజారా సోదరులు పండుగలు, తీజ్ ఉత్స వాలు నిర్వహించుకునేందుకు అనువైన స్థలాన్ని కేటాయించి, భవనం నిర్మించేలా సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడుతానని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కి గౌడ్ పేర్కొన్నారు. సేవాలాల్ మహారాజ్ బంజారా సేవాదళ్ ఆధ్వర్యంలో సాహెబ్ నగర్‌లోని వెంకటేశ్వర కాలనీ లో నిర్వహించిన తీజ్ ఉత్సవాలకు కార్పొరేటర్ సుజాత నాయక్‌తో కలిసి మధుయాష్కి గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బంజారా మహిళలు మధుయాష్కి తోపాటు, నాయకుల తలలపై మొలకలు పోసి తమ సాంప్రదాయాన్ని చాటి చెప్పారు. అంతేకాకుండా మధుయాష్కి చుట్టూ బంజారా సాంప్రదాయాలు నృత్యాలు చేసి తమ అభిమానం చాటుకు న్నారు. ఈ సందర్భంగా మధుయాష్కి మాట్లాడుతూ.. ఈ భూమి, వనరులు అందరివి అని.. గిరిజన బంజారా సోదరులు ఐక్యమత్యంతో పోరాడినప్పుడే హక్కులు లభిస్తాయని పేర్కొన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో మాజీ కార్పొరేటర్ సుజాత నాయక్ పై గతంలో స్థానిక ఎమ్మెల్యే వేధించిన సమయంలో, మొన్న సాహెబ్ నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్ నాయక్ పై, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బుడ్డా సత్యనారా యణ గార్లపై కొందరు వ్యక్తులు అనుచిత, అసభ్య మాటలు గిరిజన బంజారా సోదరులు సరైన రీతిలో స్పందించకపోవడం విచారకరమ న్నారు. కులాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే ఎవరూ సహించకూడదని, ఐక్యంగా ఎదుర్కోవాలని సూచిం చారు. బంజారా, గిరిజన సోదరులు ఐక్యంగా ఉన్నప్పుడే రాజకీయంగా కానీ, ఇతర రంగాల్లోనూ అవకా శాలు వస్తాయని సూచించారు. కాంగ్రెస్ పార్టీ గిరిజన బంజారా నాయకులను ప్రోత్సహిస్తుందని.. బలరాం నాయక్ ని కేంద్రమంత్రిని చేసిందని, బెల్లయ్య నాయక్ ని ఆదివాసి కాంగ్రెస్ జాతీయ కార్యవర్గంలో నియమించారని గుర్తు చేశారు. బంజర హిల్స్ లాంటి సంపన్న ప్రాంతాలు ఒకప్పుడు ఆదివాసి గిరిజనులవేనన్నారు. ఈ దేశ వనరుల్లో సంపదలో బంజారాలకు హక్కు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనాథ్, డీసీసీ ఉపాధ్యక్షులు కొండోజు శ్రీనివాస్, స్పోక్స్ పర్సన్ దాము మహేందర్ యాదవ్, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ గణేష్ నాయక్ , జిల్లా కార్యదర్శి రేణు గౌడ్, ఎస్సీ సెల్ సాహెబ్ నగర్ అధ్యక్షురాలు సరస్వతి, నాయకులు చంద్రకాంత్ గౌడ్, సురేష్ యాదవ్, నందకిషోర్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సమాచార హక్కు చట్టం సాధన కమిటీ

– ప్రతి జిల్లాలో కమిటీని బలోపేతం చేస్తాం

– డాక్టర్ చంటి ముదిరాజ్



హైదరాబాద్, సెప్టెంబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రజల హక్కుల పరిరక్షణ, పారదర్శకత, జవాబుదారీతనం కోసం సమాచార హక్కు చట్టాన్ని మరింత సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి కార్యవర్గం నిర్ణయించింది. కమిటీ ఆధ్వర్యం లో ఆదివారం బి.యన్ రెడ్డి లోని ద్వారకా కన్వెన్షన్ లో హైద రాబాద్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం విజయ వంతంగా జరిగింది. జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంస్థ భవిష్యత్ కార్యాచరణ, సంస్థాగత బలో పేతం, జిల్లాల వారీగా ప్రజా సమస్యలపై కార్యాచరణ, సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల ప్రతినిధులు తమ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం అమలులో ఎదురవుతున్న ఇబ్బందులు, అధికారుల నిర్లక్ష్యం, అవినీతి, అక్రమాలు తదితర అంశాలపై చర్చ జరిగింది. ప్రజా సమస్య లను కేవలం ప్రస్తావించడం కాకుండా, సమస్యలకు సంబం ధించిన ఆధారాలను సేకరించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, అవసరమైన సందర్భాల్లో అధికారిక ప్రాతినిధ్యాలు, ఫిర్యాదులు చేయడం, చట్టపరమైన మార్గాలను అనుసరించడం ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించారు. అలాగే రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో కమిటీ కార్యకలాపాలను విస్తరించి, మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. ప్రజలకు సమాచార హక్కుపై అవగాహన కల్పిస్తూ, ప్రభుత్వ పాలనలో పారదర్శకత మరియు జవాబుదా రీతనం పెంపొందించేందుకు సమిష్టిగా పనిచేయాలని సమా వేశం పిలుపునిచ్చింది. సమావేశాన్ని విజయవంతం చేసిన జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి బాధ్యులు, సభ్యులందరికీ జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, జాతీయ ఉపాధ్యక్షులు గోపీనాథ్ కట్టెకోలా, జాతీయ సహాయ కార్యదర్శి అన్నవరం సందీప్ రెడ్డి,వంగల వివేకానందు,రాష్ట్ర కార్యదర్శి రావుల నవీన్ కుమార్, వేణు గోపాల్,రాష్ట్ర సహాయ కార్యదర్శులు శ్రీకాంత్ రెడ్డి, అశోక్ కుమార్, కాశి సతీష్ కుమార్, గడప కృష్ణ, అరవింద స్వామి, కార్తీక్ రెడ్డి, బాపయ్య, విజయ్ రామ్ సింగ్, వంశీ కృష్ణ, రఘు, రమేష్, 33 జిల్లాల ఆర్టీఐ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయాలతోనే సమసమాజ నిర్మాణం సాధ్యం

- గుండ్లగూడెంలో అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి భూమి పూజ..
- యువత విద్యతో ఎదిగి రాజ్యాంగ విలువలను పరిరక్షించాలి..
- డాక్టర్ చిలుకు స్వామి..



ఆలేరు, సెప్టెంబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) : ఆలేరు మండలం లోని గుండ్లగూడెం గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి



శనివారం భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు విజయ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి శ్రమ శక్తి అవార్డు గ్రహీత డాక్టర్ చిలుకు స్వామి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా చిలుకు స్వామి మాట్లాడుతూ, అంబేద్కర్ తన జీవితాన్ని సమానత్వం, సామాజిక న్యాయం, విద్య, మానవ హక్కుల సాధనకు అంకితం చేసిన మహనీయుడని అన్నారు. అనేక అవమానాలు, అడ్డంకులు ఎదురైనా విద్యనే ఆయుధంగా మలుచుకుని దేశానికి దిశానిర్దేశం చేసిన గొప్ప వ్యక్తిగా నిలిచారని కొనియాడారు. భారత రాజ్యాంగ రూపకల్పనలో అంబేద్కర్ పోషించిన పాత్ర చరిత్రలో చిరస్థా యిగా నిలిచి పోయిందని పేర్కొన్నారు. ప్రతి పౌరుడికి సమాన హక్కులు, స్వేచ్ఛ, సామాజిక భద్రత కల్పించే రాజ్యాంగాన్ని అందించడం ఆయన గొప్ప సేవ అని తెలిపారు. రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరూ ఆచరిస్తేనే సమాజంలో నిజమైన సమానత్వం నెలకొం టుందని అన్నారు. అంబేద్కర్ విగ్రహం కేవలం ఒక శిల్పం కాదని, అది స్వాభిమానం, సమానత్వం, సామాజిక న్యాయం, రాజ్యాంగ స్ఫూర్తికి ప్రతీక అని చెప్పారు. గ్రామంలో నిర్మిస్తున్న ఈ విగ్రహం భావితరాలకు స్ఫూర్తి కేంద్రంగా నిలవాలని ఆకాంక్షించారు. యువతకు పిలుపునిస్తూ, "చదువుకోండి.. సంఘటితంగా ఉండండి.. ఉద్యమించండి" అనే అంబేద్కర్ సందే శాన్ని జీవిత లక్ష్యంగా మార్చుకోవాలని సూచించారు. విద్యతో పాటు క్రమ శిక్షణ, సామాజిక బాధ్యత, రాజ్యాంగంపై అవగాహన పెంపొందించుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విగ్రహ నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అంకితం చేయాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు, దాతలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ పెద్ద లు, యువత, మహిళలు, గ్రామ ప్రజలను అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రముఖులు, యువకులు, మహిళలు, విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్య క్రమం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

## అంగరంగ వైభవంగా ముగిసిన దండు మైసమ్మ తృతీయ వార్షికోత్సవాలు



- చివరి రోజు అమ్మవారికి పెద్ద ఎత్తున బోనాలు సమర్పించిన భక్తులు
- పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్న భక్తులు, ప్రముఖులు
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన గిరిజనుల బోనాలు

ఆత్మకూర్ ఎస్, సెప్టెంబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) : నెమ్మికల్ శ్రీ దండు మైసమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి ఉత్సవాల ముగింపు రోజు భక్తులు బోనాలను సమర్పించారు. మండల పరిధిలోని నెమ్మికల్ శ్రీ దండు మైసమ్మ ఆలయంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న తృతీయ వార్షికోత్సవంలో భాగంగా ఆఖరి రోజు భక్తులు భారీగా అమ్మవారి దర్శించుకున్నారు. నెమ్మికల్ తోపాటు పరిసర గ్రామాల నుండి, గిరిజన తండాల నుండి మహిళా భక్తులు బోనాలు సమర్పించారు. పాశం బండ తండా కు చెందిన గిరిజనులు సంప్రదాయ వేషధారణల తో బోనాలు సమర్పించారు.గ్రామానికి చెందిన భక్తులు వెయ్యి కి పైగా బోనాలు , యాట పోతుల తో భజనలు చేస్తూ అమ్మవారికి సమర్పించారు. ఉత్సవాలు చివరి రోజు కావడంతో భక్తులు భారీగా అమ్మవారిని దర్శించుకున్నరు. అనంతరం ఆలయ సమీపంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఉత్సవాలలో ఈవో శ్రీనివాసరెడ్డి సిబ్బంది గ్రామస్థులు పాల్గొన్నారు.

**దండు మైసమ్మను దర్శించుకున్న నేతలు..** నెమ్మికల్ శ్రీ దండు మైసమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవాల చివరి రోజు ఆదివారం నేతలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఏఐసీసీ సభ్యులు రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరి వెంట మండల పార్టీ అధ్యక్షులు ముస్కు రామచంద్రారెడ్డి, మద్ది సుధాకర్ రెడ్డి, పాండు నాయక్, కోన అయోధ్య రాములు, మిడతనపల్లి సర్పంచ్ ఉప్పుల సురేష్, రాపర్తి నాగరాజు, శిగ శ్రీనివాస్ గౌడ్, మల్లయ్య, తదితరులు ఉన్నారు.

**దండు మైసమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన ఆడేపు మహేష్ నేత..** దండు మైసమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన తృతీయ వార్షికోత్సవ సందర్భంగా బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్చార్జ్ ఆడేపు మహేష్ నేత కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## అధికారం పోయినా అహంకారం పోలేదా

– మిర్యాలగూడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తలకొప్పుల సైదులు




మిర్యాలగూడ సెప్టెంబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) : అధికారం కోల్పోయిన తర్వాత మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కాంగ్రెస్ ప్రభుత్వం, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిపై ఇష్టారీతిన విమర్శలు చేయడం సరికాదని మిర్యాలగూడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తలకొప్పుల సైదులు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన అనేక హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు.

దళిత ముఖ్యమంత్రి, దళితులకు మూడు ఎకరాల భూమి, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వంటి హామీలపై అప్పట్లో ఎందుకు ప్రశ్నించలేదని గాదరి కిషోర్‌ను నిలదీశారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం రాజకీయ అవకాశవాదమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సామాజిక న్యాయానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

మిర్యాలగూడ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కృషి చేస్తున్నారని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటున్నారని సైదులు పేర్కొన్నారు. వ్యక్తిగత విమర్శలు, నిరాధార ఆరోపణలు మానుకోవాలని గాదరి కిషోర్‌కు సూచించారు. ప్రజల మద్దతు కోల్పోయిన బీఆర్ఎస్ నాయకులకు రాబోయే రోజుల్లో ప్రజలే తగిన రాజకీయ సమాధానం చెబుతారని, కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తాయని సైదులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు కాకునూరి బసవయ్య గౌడ్, బుచ్చిరెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు దైద సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల్లో పెరుగుతున్న మధుమేహం

- చిన్నారుల్లో హార్మోన్ సమస్యలపై జాతీయ స్థాయి సదస్సు..
- బాల్య మధుమేహం, ఎదుగుదల
- యుక్తవయస్సు సమస్యలు, ఊబకాయం, ఎముకల ఆరోగ్యం, ఆధునిక పీడియాట్రిక్ ఎండోక్రైనాలజీపై పీఏఈడీఎస్ - 2026లో నిపుణుల చర్చలు



**హైదరాబాద్, సెప్టెంబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) :** చిన్నారుల్లో పెరుగుతున్న మధుమేహంతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలపై నియోనాటాలజిస్టులు, పీడియాట్రీషియన్లు ఆందోళన వ్యక్తం చేశారు. పెరుగుతున్న మధుమేహం, ఎదుగుదల లోపాలు, చిన్న వయసులోనే యుక్తవయస్సు లక్షణాలు కనిపించడం, ఆలస్యంగా యుక్తవయస్సు రావడం, ఊబకాయం, థైరాయిడ్, ఇతర హార్మోన్ సంబంధిత సమస్యలపై పి. ఏ.ఈ.డీ.ఎస్.2026 - జాతీయ పీడియాట్రిక్ ఎండోక్రైనాలజీ సదస్సు నిర్వహించారు. కిమ్స్ కడల్స్ క్లినికల్ డైరెక్టర్, చీఫ్ నియోనాటాలజిస్ట్ డా.బాబు ఎస్. మాడార్కర్ మాట్లాడుతూ, చిన్నారులు, కౌమారదశలో ఉన్నవారిలో హార్మోన్లు, జీవక్రియలకు సంబంధించిన వ్యాధులను ముందుగానే గుర్తించడం, సమర్థవంతమైన చికిత్స అందించడం, దీర్ఘకాలికంగా పర్యవేక్షించడంపై వైద్యుల అవగాహన, నైపుణ్యాలను పెంచడమే ఈ సదస్సు లక్ష్యమని తెలిపారు.

దేశంలోని ప్రముఖ పీడియాట్రీషియన్లు, ఎండోక్రైనాలజిస్టులతో పాటు వివిధ వైద్య విభాగాలకు చెందిన నిపుణులు ఈ సదస్సులో పాల్గొని శాస్త్రీయ చర్చలు, నిపుణుల ప్రసంగాలు, ప్రాక్టికల్ వర్క్‌షాప్‌లు నిర్వహించారు. సదస్సులో చిన్నారుల్లో కనిపించే కంజెనిటల్ హైపోథైరాయిడిజం, హైపోగ్లైసీమియా, రికెట్స్, బౌలెగ్స్, అధిక రక్తపోటు, డిఫరెన్సియేషన్ ఆఫ్ సెక్స్ డెవలప్‌మెంట్ , ముందస్తు యుక్తవయస్సు, ఆలస్యమైన యుక్తవయస్సు, పొట్టితనం, గ్రోత్ హార్మోన్ చికిత్స తదితర అంశాలపై తాజా వైద్య విధానాలను నిపుణులు వివరించారు. పీడియాట్రిక్ ఎండోక్రైనాలజిస్టు డా. కిషోర్ భాస్కర్ మాట్లాడుతూ, చిన్నారుల్లో మధుమేహంపై ప్రత్యేక సెషన్ నిర్వహించినట్లు తెలిపారు. మారుతున్న ఆహార అలవాట్లు చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, దీంతో వారు జీవనశైలి వ్యాధులకు గురవుతున్నారని వివరించారు.

టైప్-2 మధుమేహంలో మెట్ఫార్మిన్ తర్వాత అందుబాటులో ఉన్న చికిత్సా విధానాలు, జీ.డీ.ఎస్.-1 అనలాగ్స్, టైప్-1 మధుమేహంలో వస్తున్న ఆధునిక చికిత్సా పద్ధతులు, భవిష్యత్తులో అందుబాటులోకి రానున్న మార్పులపై చర్చించినట్లు తెలిపారు. పీడియాట్రిక్ ఎండోక్రైనాలజీలో జన్యుపరమైన అంశాలు, పాలీఎండోక్రైన్ మెటబాలిక్ ఓవేరియన్ సిండ్రోమ్, చిన్నారుల్లో ఊబకాయం వంటి అంశాలపై కూడా నిపుణులు దృష్టి సారించారు. పీడియాట్రిక్ ఎండోక్రైనాలజీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగంపై కూడా ప్రత్యేకంగా చర్చించారు. వైద్య రంగంలో అభివృద్ధి చెందుతున్న ఏ ఐ సాంకేతికతల వల్ల కలిగే అవకాశాలు, వాటి పరిమితులపై నిపుణులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. సైద్ధాంతిక అంశాలతో పాటు ప్రాక్టికల్ శిక్షణకు కూడా సదస్సులో ప్రాధాన్యం ఇచ్చారు. గ్రోత్ చార్ట్, గ్రోత్ హార్మోన్ పెన్, బోన్ ఏజ్, డెక్సా స్కాన్, కంటిన్యూయస్ గ్లూకోజ్ మానిటరింగ్, ఇన్సులిన్ పంపు, కార్బోహైడ్రేట్ కౌంటింగ్, ఇన్సులిన్ పెన్ వంటి అంశాలపై నిర్వహించిన ప్రత్యేక వర్క్‌షాప్‌లు యువ వైద్యులకు ఎంతో ఉపయోగకరంగా నిలిచాయని తెలిపారు. చిన్నారుల్లో హార్మోన్లు, జీవక్రియలకు సంబంధించిన సమస్యలకు ప్రత్యేక వైద్య సేవల అవసరం పెరుగుతున్న నేపథ్యంలో సమగ్ర పీడియాట్రిక్ ఎండోక్రైనాలజీ సేవలు అందుబాటులో ఉండటం కీలకమని నిపుణులు పేర్కొన్నారు. 18 ఏళ్లలోపు చిన్నారులు, కౌమారదశలో ఉన్నవారిలో హార్మోన్ సమస్యలను గుర్తించడం, చికిత్స అందించడం, దీర్ఘకాలిక పర్యవేక్షణతో పాటు కుటుంబ సభ్యులకు అవగాహన, పోషకాహార సహకారం, మల్టీడిసిప్లినరీ వైద్య సేవలను అందించే విధానాన్ని అనుసరించాలని వివరించారు. చిన్నారుల్లో హార్మోన్ సమస్యలను తొలిదశలో గుర్తించి, సరైన సమయంలో చికిత్స అందించడం, దీర్ఘకాలికంగా పర్యవేక్షించడం ద్వారా భవిష్యత్తులో వచ్చే అనేక సమస్యలను నియంత్రించే అవకాశం ఉంటుందని వైద్యులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పి. ఏ.ఈ.డీ.ఎస్. 2026 సదస్సు ద్వారా చిన్నారుల్లో సంక్లిష్టమైన హార్మోన్, జీవక్రియ సంబంధిత సమస్యల నిర్ధారణ, చికిత్సలో తాజా వైద్య విధానాలపై వైద్యులకు మరింత అవగాహన కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## పర్యావరణహిత 'మైండ్‌ఫుల్ మార్నింగ్'కు
# మహావీర్ హాస్పిటల్‌కు గోల్డ్ అవార్డు




**ఖైరతాబాద్, సెప్టెంబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) :** మహావీర్ హాస్పిటల్ & రీసెర్చ్ సెంటర్ చేపట్టిన 'మైండ్‌ఫుల్ మార్నింగ్' కార్యక్రమానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఈ కార్యక్రమానికి ఈ4ఎం ఇండియన్ మార్కెటింగ్ అవార్డ్స్ సౌత్-2026లో ఆరోగ్య సంరక్షణ సుస్థిర మార్కెటింగ్ విభాగంలో గోల్డ్ అవార్డు దక్కింది. ఈ అవార్డును మహావీర్ హాస్పిటల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, టెంపెస్ట్ అడ్వర్టైజింగ్ ట్రస్టీ సభ్యురాలు రేఖా ఓస్వాల్ అందుకున్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రారంభించిన ఈ కార్యక్రమంలో ప్లాస్టిక్ టూత్‌బ్రష్‌లకు ప్రత్యామ్నాయంగా పర్యావరణహిత వెదురు టూత్‌బ్రష్‌ల వినియోగాన్ని ప్రోత్సహించారు. సాధారణ ఉదయపు దినచర్యను పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే కార్యక్రమంగా మార్చడం ఈ ప్రచారం ప్రత్యేకతగా నిలిచింది. టెంపెస్ట్ అడ్వర్టైజింగ్ సహకారంతో రూపొందించిన ఈ ప్రచారంలో భాగంగా మసబ్ ట్యాంక్‌లోని మహావీర్ హాస్పిటల్ డెంటల్ విభాగం రోగులు, సందర్శకులు, సిబ్బందికి వెదురు టూత్‌బ్రష్‌లతో పాటు అవగాహన కరపత్రాలను పంపిణీ చేసింది. ప్రతిరోజూ ఉపయోగించే వస్తువుల విషయంలో పర్యావరణహిత ఎంపికలను ప్రోత్సహించడం ద్వారా సమాజంలో మార్పు తీసుకురావచ్చని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. ప్రపంచవ్యాప్తంగా ఏటా కోట్లాది ప్లాస్టిక్ టూత్‌బ్రష్‌లు వ్యర్థాలుగా మారుతున్న నేపథ్యంలో, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని మహావీర్ హాస్పిటల్ ఈ కార్యక్రమం ద్వారా సందేశాన్ని అందించింది.

## శ్రావణమాసం సందర్భంగా
# సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు



**మేడ్చల్ సెప్టెంబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) :** శ్రావణమాసం సందర్భంగా మేడ్చల్‌లోని శ్రీ శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో ఆదివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతా లను భక్తిశ్రద్ధలతో పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో పలువురు దంపతులు, భక్తులు, విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ శ్రావణమాసం అత్యంత పవిత్రమైన మాసమని, ఈ మాసంలో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాన్ని సామూహికంగా నిర్వహించడం వల్ల భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందుతుందని తెలిపారు. శ్రీ సత్యనారాయణ స్వామిని భక్తిశ్రద్ధలతో పూజించడం వల్ల కుటుంబాల్లో సుఖశాంతులు, ఐశ్వర్యం, ఆరోగ్యం కలగాలని ఆకాంక్షించారు. భక్తులందరూ ధర్మబద్ధమైన జీవనం సాగిస్తూ, ఆలయాల్లో జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. సామూహికంగా నిర్వహించిన ఈ వ్రతంలో పెద్ద సంఖ్యలో దంపతులు, భక్తులు పాల్గొనడం సంతోషంగా ఉందని, స్వామివారి కృప, ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు శానాల విష్ణు చారి, పుత్తూరు సురేష్ చారి, వెంకటేష్ చారి, సత్యనారాయణ చారి, మల్లేశ్వరి, భాస్కర్ చారి, రవిశంకర్ చారి, శేఖర్ చారి, సంతోష్ చారి, వినోద్ చారి, గురుచరణ్ చారి పాల్గొన్నారు.

# రాజకీయాల్లో అజాత శత్రువు ముసిలయ్య..
## - మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్..



**నందిగామ సెప్టెంబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) :** పార్టీలకు అతీతంగా గ్రామ ప్రజాలందరితో కలిసిమెలిసి ఉంటూ గ్రామాన్ని అభివృద్ధి దిశగా పయనించేలా కృషి చేసిన కీ.శే. మాజీ సర్పంచ్ గోవిందు ముసిలయ్య అజాత శత్రువని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. నందిగామ మండలంలోని నర్సప్పగూడ గ్రామంలో మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ స్వర్గీయ గోవిందు ముసిలయ్య 12వ వర్ధంతి వేడుకలను ఆయన కుమారుడు మాజీ సర్పంచ్ గోవిందు అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ హాజరై ముసిలయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లులు అర్పించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ముసిలయ్య గ్రామ అభివృద్ధికి ఎన్నో సేవా కార్యక్రమాలు,ఎన్నో సహాయ సహకారాలు చేశారన్నారు.గ్రామంలో అందరితో కలగొలుపుగా ఉంటూ, అందరిని ఆప్యాయతగా పలకరిస్తూ గ్రామాన్ని సస్యశ్యామలం చేశారని అన్నారు.ఆయన సేవలు కూడ గ్రామస్థులు హృదయాల్లో చిరకాలం గుర్తుండేలా చేశారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వంకాయల నారాయణరెడ్డి,మాజీ జెడ్పి వైస్ చైర్మన్ ఈట గణేష్,మాజీ సర్పంచ్ జిల్లెళ్ల వెంకట్ రెడ్డి,మాజీ పిఎసిఎస్ చైర్మన్ మామిళ్ళ విఠల్, సర్పంచులు కొడిచర్ల రాజేశ్వరి శ్రీనివాస్,జట్ట కుమార్,మాజీ ఎంపిటిసి కాట్న శ్రీశైలం,బీఆర్ఎస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు..

## ఆల్ ఇండియా కరాటే ఛాంపియన్‌షిప్‌లో
# కుర్తివాడ విద్యార్థుల ప్రతిభ..




**పాపన్నపేట, సెప్టెంబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) :** గచ్చిబౌలి స్టేడియంలో టైకా ఆధ్వర్యంలో నిర్వహించిన ఆల్ ఇండియా కరాటే ఛాంపియన్‌షిప్‌లో కుర్తివాడ గ్రామానికి చెందిన విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించారు. ఈ పోటీల్లో ముక్కట్ల శ్రీనిక గోల్డ్ మెడల్, వేదశ్రీ సిల్వర్ మెడల్, గగన్ సిల్వర్ మెడల్, లతిక బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈ ఛాంపియన్‌షిప్‌కు ప్రముఖ సినీ నటుడు హీరో సుమన్ తల్వార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోటీలను నాగేష్ మాస్టర్ ప్రధాన ఆర్గనైజర్‌గా పర్యవేక్షించగా, మణి మాస్టర్‌తో పాటు పలువురు కరాటే మాస్టర్లు పాల్గొన్నారు.విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి కుర్తివాడ గ్రామానికి, తమ పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని నాగేష్ మాస్టర్ ఆకాంక్షించారు.

# ఆటో కార్మికులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

- ప్రతీ ఆటో కార్మికుడికి బాకీ పడ్డ 36 వేల రూపాయలను ఎప్పుడు చెల్లిస్తావ్
- రేవంత్ రెడ్డిని ప్రశ్నించిన బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

**కుత్బుల్లాపూర్, సెప్టెంబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రతి ఆటో కార్మికుడికి సంవత్సరానికి 12 వేల రూపాయలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం మూడు సంవత్సరాలైనా 12 వేల రూపాయల కాదు కదా 12 పైసలు కూడా ఇవ్వకుండా ఆటో కార్మికులను మోసం చేసిందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. కాంగ్రెస్ 1000 రోజుల దగా పాలనలో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వారం రోజులపాటు నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో భాగంగా ఐదవ రోజు మౌలిక వసతుల కల్పనలో కాంగ్రెస్ ప్రభుత్వ విఫలం, ఆటో కార్మికులకు సంవత్సరానికి 12 వేల రూపాయలు ఇస్తామని చెప్పి మోసం చేసిన తీరును నిరసిస్తూ బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ఆధ్వర్యంలో సుచిత్ర చౌరస్తా నుంచి జీడిమెట్ల గ్రామం గాంధీ విగ్రహం వరకు ఆటో కార్మికులతో కలిసి బిఆర్ఎస్ శ్రేణులు భారీ ఆటో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఆచరణకు సాధ్యం కానీ అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆటో కార్మికులను రోడ్డున పడేసిందన్నారు. మూడు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వం ఒక్కో ఆటో కార్మికుడికి 36వేల రూపాయలను బాకీ ఉందని, రేవంత్ రెడ్డి ఈ బాకీ ని ఎప్పుడు చెల్లిస్తారో ఆటో కార్మికులకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ నగరంలో రాత్రి అయితే చాలు చిమ్మ చీకట్లు అలుముకుంటున్నాయి. కొత్త వీధి దీపాల ఏర్పాటు ను పక్కకు పెడితే ఉన్న వీధి దీపాల నిర్వాహణను కూడా నిర్వహించలేని నిస్సహాయ స్థితిలో ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు. నగరంలో ఎక్కడ ఏ రోడ్డు చూసినా డ్రైనేజీ మూతలు కుంగడం వాటిని మార్చకపోవడంతో వాహన దారులు, పాదాచారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్న ప్రజలకు మౌలిక వసతులను కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిం దన్నారు. వేగంగా విస్తరిస్తున్న నార్త్ హైదరాబాద్ నగరాన్ని పక్కకు పెట్టి సీఎం తన ఊహల నగరమైన ఫోర్త్ సిటీకి అధిక ప్రాధాన్యతనిస్తూ హైదరాబాద్ నగర ప్రజలను విస్మరిస్తున్నారని విమర్శించారు. వేగంగా విస్తరిస్తున్న నార్త్ హైదరాబాద్ సిటీకి మెట్రో రైలు మార్గం ఎంతో అవసరం. కానీ ప్రభుత్వం మాత్రం నార్త్ హైదరాబాద్ సిటీని పక్కకు పెట్టి ఫోర్త్ సిటీ పేరుతో రాజకీయాలు చేస్తూ ఇక్కడి ప్రజలను మోసం చేస్తుంది. ఇదే విషయంలో మెట్రో సాధన సమితి సభ్యులు, ప్రజల పక్షాన మేము ఎన్ని సార్లు ధర్నాలు చేసినా ప్రభుత్వంలో మాత్రం ఎటువంటి చలనం లేదని తెలిపారు. ఫోర్త్ సిటీలో కనీసం ఒక పుట్టు, ఒక మనిషి నివసించే పరిస్థితి లేదు. అలాంటి నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామంటూ నానా హైరానా చేస్తూ హైదరాబాద్ మహానగరాన్ని మూడు ముక్కలు చేసి మౌలిక వసతులను కల్పించకుండా ప్రజలకు తీవ్ర అవస్థలు అవస్థలు కలిగిస్తున్నారని మండిపడ్డారు. యధా రాజా తధా ప్రజా.. అనే విధంగా రాష్ట్రంలో గుంపు మేస్త్రి వ్యవహరిస్తుంటే స్థానికంగా ఉన్న కొందరు కాంగ్రెస్ నాయకులు కార్లల్లో కొబ్బరికాయలు పెట్టుకొని తిరుగుతూ ఎక్కడపడితే అక్కడ కొబ్బరికాయలు కొడుతూ చెడ్డి గ్యాంగ్‌లా కొబ్బరికాయల గ్యాంగ్ తయారయ్యిందని ఎద్దేవ చేశారు. ఇకనైనా స్థానిక కాంగ్రెస్ నాయకులు ఈ కొబ్బరికాయల చిల్లర రాజకీయాలను బంద్ చేయాలి. ప్రజలు అంతా గమనిస్తా ఉన్నారు. మీరు ఎన్ని వేషాలు వేసిన ప్రజలు మళ్లీ ముఖ్య మంత్రిగా కెసిఆర్‌ని కోరుకుంటున్నారు. రానున్న ఎన్నికల్లో కెసిఆర్ మళ్లీ సీఎం అవ్వడం కాయం కాంగ్రెస్ పార్టీ భూస్థాపితం అవ్వడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన వివిధ మున్సిపాలిటీల మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు,పార్టీ నాయకులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక సంక్షేమ సంఘాల సభ్యులు, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



# అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు సహించం



**కీసర, సెప్టెంబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) :** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానపరిచే విధంగా వ్యాఖ్యలు చేస్తున్న హమారా ప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కీసర పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గుజ్జుక పరుశురాం మాట్లాడుతూ.. అంబేద్కర్‌పై జరుగుతున్న అవమానకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. అంబేద్కర్‌ను కించపరిచే విధంగా పుస్తకం రాసి ప్రచారం చేస్తున్న హమారా ప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన అంబేద్కర్ సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించాలని అన్నారు. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు, పుస్తక ప్రచురణను నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజేంద్ర ప్రసాద్, గౌతమ్, పాదుగుల రూప చంద్రమౌళి, హనుమంత రావు మహర్, రాజ్ కిరణ్ మహర్, రఘు మహర్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

**అంబేద్కర్ జోలికి వస్తే ఖబడ్దార్ :** భారత రాజ్యాంగం, డా.బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అవమానించే వ్యాఖ్యలు సహించేది లేదని కీసర మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు కర్రె గణేష్ హెచ్చరించారు. 239వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమంలో అంబేద్కర్‌కు పూలమాల సమర్పించి, హమారా ప్రసాద్ వ్యాఖ్యలను నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. అంబేద్కర్ చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను ఖండిస్తున్నామని గణేష్ తెలిపారు.కార్యక్రమంలో సంఘంనాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# రెడ్ల నిరసన దీక్ష తాత్కాలికంగా వాయిదా
## - తెలంగాణ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్ రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) :** డిమాండ్ల సాధన కోసం ఈనెల 8న ఇందిరాపార్క్ వద్ద రాష్ట్ర రెడ్డి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన రెడ్ల నిరసన దీక్షను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు తెలంగాణ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డిలు ఈ మేరకు రెడ్డి ఐకాస నాయకులతో చర్చలు జరిపారని తెలిపారు. తమ డిమాండ్లపై వారు సానుకూలంగా స్పందించి, నెల రోజుల్లో సమస్యలను పరిష్కరిస్తామని ప్రభుత్వం తరపున స్పష్టమైన హామీ ఇవ్వడంతో నిరసన దీక్షను వాయిదా వేసినట్లు జైపాల్ రెడ్డి పేర్కొన్నారు. విద్యార్థులు, రైతులు, వివిధ ఓసీ సామాజిక వర్గాలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఓసీ జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు డిమాండ్ చేశారు. హామీలను అమలు చేయకపోతే ప్రభుత్వం మూల్యం చెల్లించక తప్పదని ఆయన హెచ్చరించారు.

# పరిగి చింతల్‌చెరువు సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం..
## - ఒకరు మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు




**వికారాబాద్, సెప్టెంబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) :** వికారాబాద్ జిల్లా పరిగి మండలం చింతల్‌చెరువు సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. లారీని కారు ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన అనంతరం కారులో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో గంగుపల్లి గ్రామానికి చెందిన మున్నూరు నర్సింలు, (65) అక్కడికక్కడే మృతి మృతి చెందాడు. మృతుడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ప్రమాద సమయంలో నర్సింలు కారు ముందు సీటులో కూర్చున్నట్లు పోలీసులు తెలిపారు. కారులో నర్సింలుతో పాటు ఆయన భార్య మున్నూరు అంజమ్మ, (40), కారు నడుపుతున్న మున్నూరు అభిరామ్, (22) ఈ ప్రమాదంలో అంజమ్మ, అభిరామ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి క్షత గాత్రులను బయటకు తీసేందుకు ప్రయత్నిం చారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. గాయ పడిన వారిని చికిత్స నిమిత్తం ఆసు పత్రికి తరలించారు. పరిగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.




# వినాయకుని ఖర్చుల కోసం లడ్డూ వేలం డబ్బులు విరాళం



**మణికొండ, సెప్టెంబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) :** నెక్నంపూర్ విలేజ్‌లో నిర్వహించిన వినాయక లడ్డూ వేలం పాటలో గత సంవత్సరం లడ్డూను రూ.4,11,000లకు కైవసం చేసుకున్న శంకర్, ఆ మొత్తాన్ని ఈ సంవత్సరం వినాయకుని ఉత్సవ ఖర్చుల నిమిత్తం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా నెక్నంపూర్ విలేజ్ వాసులు మాట్లాడుతూ గత సంవత్సరం వినాయక లడ్డూ వేలంలో పాల్గొని లడ్డూను కైవసం చేసుకున్న శంకర్, ఈ ఏడాది అదే మొత్తాన్ని వినాయకుని ఉత్సవ ఖర్చుల కోసం అందించడం అభినందనీయమన్నారు. శంకర్‌తో పాటు వారి కుటుంబ సభ్యులకు విఘ్నేశ్వరుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నెక్నంపూర్ విలేజ్ వాసులు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో పాటు బీజేపీ నాయకులు వేణు కుమార్, కుంభగల రవికాంత్, రాజు, రాహుల్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# మల్లంపల్లి సమీపంలో మృతదేహం లభ్యం

**– కాజీపేట వాసిగా గుర్తింపు**

**– మృతిపై పోలీసుల దర్యాప్తు**



**మల్లంపల్లి, సెప్టెంబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) :**

మల్లంపల్లి మండల పరిధిలోని మహ్మద్ గౌస్‌పల్లిమల్లంపల్లి గ్రామాల మధ్య ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. మృతుడిని హన్మకొండ జిల్లా కాజీపేటకు చెందిన ముక్తార్ మహమ్మద్ (46)గా గుర్తించారు. మల్లంపల్లి ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలంలో లభించిన ఆధారాలను సేకరించి విచారణ చేపట్టారు. అనంతరం మృతుడి వివరాలను నిర్ధారించారు. మృతుడు కాజీపేట నుంచి మల్లంపల్లి ప్రాంతానికి ఎలా వచ్చాడు? ఆయన మృతికి గల కారణాలేమిటి? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ములుగు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. పోస్టుమార్టం నివేదిక, దర్యాప్తులో వెలుగుచూసే ఆధారాల ఆధారంగా మృతికి గల కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# కాంగ్రెస్ ప్రజాపాలన విజయోత్సవ సంబరాలు

**తాండూర్, సెప్టెంబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) :**

తెలంగాణలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల ప్రజా పాలనను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా తాండూర్ మండలం ఐబీ కేంద్రంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో విజయోత్సవ వేడుకలు, సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, సీనియర్ నాయకులు హాజరయ్యారు. టపాకాయలు పేల్చి, కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు, ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు పట్టెం విష్ణు కళ్యాణ్ మాట్లాడుతూ, గత 1000 రోజులలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రజా పాలన అందిస్తోందని, రైతు భరోసా, మహాలక్ష్మి పథకం, గృహజ్యోతి, లాంటి పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతోందని అన్నారు. రాబోయే రోజుల్లో కూడా కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన ఉంటుందని స్పష్టం చేశారు. మాజీ ఎంపీపీ సిరంగి శంకర్ తాండూరు



సర్పంచ్ సురేష్, యూత్ కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి రత్నం ప్రదీప్ యూత్ కాంగ్రెస్ బెల్లంపల్లి నియోజకవర్గ అధ్యక్షులు సన్నీ బాబు, జిల్లా ఉపాధ్యక్షులు అరుణ్ వాల్మీకి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు రోహిత్ హరీష్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శులు శివకృష్ణ, ప్రవీణ్, బెల్లంపల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాకేష్, తాండూర్ ప్రధాన కార్యదర్శి అరుణ్ ఉపాధ్యక్షుడు శ్రీధర్, మాదారం 3 సర్పంచ్ రవి నాయకులు మాసాడి తిరుపతి, శివకృష్ణ, అయుబ్, భూమయ్య, మహేష్, రఫ్, మారిశెట్టి శ్రీనివాస్, పాల్గొన్నారు.

# అంగన్వాడీలకు 18 వేల వేతనం నిర్ణయించాలి

## ఈనెల 9న ఇందిరా పార్క్ వద్ద ధర్నా




**తాండూర్, సెప్టెంబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) :**

తాండూర్ మండల కేంద్రంలో ఆదివారం అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయు) మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సీఐటీయు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అబ్బోజు రమణ, దుంపల రంజిత్ కుమార్ హాజరై మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాల్లో అంగన్వాడీలకు రూ.18 వేల వేతనం నిర్ణయించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రీ-ప్రైమరీ, పీఎంశ్రీ 4,131 కేంద్రాలను రద్దు చేసి అంగన్వాడీలకు అప్పగించాలని, 15 వేల ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. సెప్టెంబర్ 9న ఇందిరా పార్క్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం, జిల్లా అధ్యక్షురాలు భానుమతి, నాయకులు వేరోనికా, సత్యవతి, లీలారాణి, సుజాత, విజయలక్ష్మి, ప్రమీల, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# బాసర అభివృద్ధికి రూ.354 కోట్లు





**– రూ.20 కోట్లతో పుష్కర ఘాట్ల అభివృద్ధికి శంకుస్థాపన**

**– గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తాం: మంత్రి జూపల్లి**

**నిర్మల్ జిల్లా, సెప్టెంబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) :**

వచ్చే ఏడాది జూన్ 27 నుంచి నిర్వహించనున్న గోదావరి పుష్కరాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏడాది ముందుగానే ఏర్పాట్లు ప్రారంభించిందని రాష్ట్ర మద్యం, ఆబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఆదివారం బాసరలో పర్యటించిన ఆయన రూ.20 కోట్లతో చేపట్టనున్న పుష్కర ఘాట్ల నిర్మాణం, విస్తరణ, మరమ్మతులు, అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గోదావరి నదీమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**ఆలయానికి మహర్దశ**

బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చేసేందుకు రూ.354 కోట్లతో చేపట్టనున్న సమగ్ర అభివృద్ధి, నూతన నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఆధునిక సౌకర్యాలు కల్పించడంతో పాటు భక్తుల రద్దీకి అనుగుణంగా మౌలిక వసతులను ముందుగానే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

**భక్తుల సౌకర్యాలపై దృష్టి**

పుష్కరాలకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున భద్రత, సౌకర్యాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సూచించారు. ఘాట్ల విస్తరణతో పాటు అవసరమైన చోట కొత్త ఘాట్ల నిర్మాణం, మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. మహిళల కోసం ప్రత్యేక డ్రెస్సింగ్ రూములు, మరుగుదొడ్లు, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

ప్రధాన పుష్కర ప్రాంతాల్లో 24 గంటల వైద్య సేవలు అందుబాటులో ఉండేలా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, వైద్యులు, అత్యవసర మందులు, అంబులెన్స్‌లను ముందుగానే సిద్ధంగా ఉంచాలని తెలిపారు. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటు చేసి, అవసరమైన చోట ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

పోలీసు, రెవెన్యూ, దేవాదాయ, వైద్య, మున్సిపల్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేసి పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేయాలని అన్నారు. పుష్కర ప్రాంతాల్లో నిరంతర పారిశుద్ధ్య నిర్వహణతో పాటు స్వచ్ఛమైన తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర ప్రాథమిక సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

**రాష్ట్రవ్యాప్తంగా రూ.వెయ్యి కోట్ల పనులు**

ఆలయ ఈవో కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గోదావరి పుష్కరాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఏడాది ముందుగానే పనులు ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పుష్కరాల కోసం దాదాపు రూ.1,000 కోట్లతో వివిధ అభివృద్ధి, మౌలిక వసతుల పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రజాభవన్‌లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమీక్షిస్తామని చెప్పారు.

బాసరతో పాటు గోదావరి నదీ తీర జిల్లాల్లోని మొత్తం 12 ప్రాంతాల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు



తెలిపారు. పుష్కరాల పనులను నిర్ణీత గడువులోగా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల నాణ్యత, పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక ఐఏఎస్ అధికారిని నియమించినట్లు వెల్లడించారు.

**పకడ్బందీ ఏర్పాట్లు: కలెక్టర్**

బాసర గోదావరి పుష్కరాల ఏర్పాట్లు, పుష్కర ఘాట్ల అభివృద్ధి, శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ సమగ్ర అభివృద్ధికి సంబంధించిన మ్యాపులు, ప్రతిపాదనలు, పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా మంత్రికి వివరించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

పాల్గొన్నవారు: ఎమ్మెల్సీ దండే విఠల్, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, అదనపు కలెక్టర్ బి.వెంకటేశ్వర్లు, భైంసా సబ్‌కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఏఎస్పీ సాయి కిరణ్, ఆలయ ఈవో అంజనా దేవి, తహసీల్దార్ పవన్ చంద్ర, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న గిద్దలూరు టిడిపి నేత కృష్ణ కిషోర్..



**బేస్తవారిపేట, సెప్టెంబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) :**

బేస్తవారిపేట పట్టణం, దర్గా కొండ పై, శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మండపంలో, బెస్తవారిపేట పట్టణ మండల పరిషత్ బాలికల పాఠశాలలో గిద్దలూరు పట్టణానికి చెందిన రావుల వసంత లక్ష్మి ఉపాధ్యాయ వృత్తి నిర్వహించి పదవీ విరమణ చేశారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు నియోజకవర్గ టీడీపీ నేత ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని వారి దంపతులకు పూలమాల శాలువా వేసి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 40 సంత్సరాల పాటు సుదీర్ఘ ఉపాధ్యాయ వృత్తిలో ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దటంలో వారి సేవలు మరువ లేనివని, వారు పదవీ విరమణ చేసినప్పటికి వారి జ్ఞానం, వారి సేవలు సమాజానికి ఎంతగానో స్ఫూర్తినిస్తాయన్నారు.. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు..

# వినాయక విగ్రహ దాతపై అభ్యంతరం

**చింతకొమ్మదిన్నె, సెప్టెంబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) :**



స్థానిక మండల పరిధిలోని గోపులాపురం గ్రా మంలో గత కొన్ని సంవత్స రాలుగా వినాయక చవితి పండుగ సందర్భంగా గ్రామ పెద్దలు, దాతలు స్వచ్ఛందంగా వినాయక విగ్రహాన్ని అందిస్తూ, గ్రామమంతా ఐక్యతతో పండు గను జరుపుకోవడం ఆనవా యితీగా వస్తోంది. ఈ సంవత్సరం గ్రామానికి చెందిన బిజెపి నాయ కులు నీలం నారాయణరెడ్డి భక్తి శ్రద్ధలతో వినాయక విగ్రహాన్ని విరాళంగా ఇవ్వడానికి ముందు. కు వచ్చారు. అయితే గ్రామంలోని ప్రధాన ప్రతిపక్షానికి చెందిన కొంతమంది నాయకులు, ఊరిపై వసూలు చేసిన చందా డబ్బును మాత్రమే విగ్రహానికి వాడాలని, వ్యక్తిగతంగా ఎవరూ విగ్రహం ఇవ్వకూడదని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. విగ్రహ దానం అనేది రాజకీయాలకు అతీత మైన భక్తి కార్యక్రమం. దీనిని అడ్డుకోవడం గ్రామ ఐక్యతను దెబ్బతీయడమే. ఈ విషయమై సదరు బిజెపి నాయకులు చింతకొమ్మదిన్నె పోలీస్ స్టేషన్. ను ఆశ్రయించగా, పోలీసు వారు ఇరు వర్గాలను కూర్చొని మాట్లా డుకోవాలని సూచించారు. అయినప్పటికీ ప్రతిపక్ష నాయకు లు అంగీకరించకుండా దురు సుగా ప్రవర్తిస్తున్నారని సమా చారం. వినాయక చవితి వంటి పవిత్ర పండుగలో రాజకీయాలు చొప్పించి, భక్తుల మనోభావా లను దెబ్బతీసే చర్యలను భార తీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. పోలీసు శాఖ వెంట నే జోక్యం చేసుకుని, పం డుగ ప్రశాంతంగా జరిగేలా చర్య లు తీసుకోవాలని ప్రజలు కోరు కుంటున్నారు.

# ముందస్తు పరీక్షలతో క్యాన్సర్‌ను గుర్తించాలి

## నిర్మల్‌లో బసవతారకం ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం

**నిర్మల్ జిల్లా, సెప్టెంబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) :**

క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించి సకాలంలో చికిత్స అందించాలనే లక్ష్యంతో బసవతారకం ఇండో, అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్మల్ పట్టణంలోని ప్రియదర్శినినగర్ లయన్స్ క్లబ్ భవన్‌లో ఆదివారం ఉచిత మెగా క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని నిర్వహించారు. హైదరాబాద్‌లోని బసవతారకం ఆసుపత్రి నుంచి నిపుణులైన వైద్యులు, వైద్య సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందం నిర్మల్‌కు చేరుకుని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించింది.

అత్యాధునిక వైద్య పరికరాలతో కూడిన ప్రత్యేక మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ బస్సును శిబిరానికి తీసుకొచ్చి రొమ్ము, గర్భాశయ, నోటి క్యాన్సర్లతో పాటు ఇతర క్యాన్సర్లను ముందస్తుగా గుర్తించేందుకు అవసరమైన పరీక్షలు నిర్వహించారు. అనుమానిత లక్షణాలు ఉన్న వారికి తదుపరి వైద్య పరీక్షలు, చికిత్స కోసం హైదరాబాద్‌లోని బసవతారకం ఆసుపత్రిని సంప్రదించాలని వైద్యులు సూచించారు. క్యాన్సర్ లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా ముందస్తుగా పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి మెరుగైన చికిత్స పొందే అవకాశం ఉంటుందని అవగాహన కల్పించారు.



శిబిరం నిర్వహణలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు సహకరించారు. లయన్స్ క్లబ్ నిర్మల్ అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, జనరల్ సెక్రెటరీ ఎం. శ్రీనివాస్ గుప్తా, జోన్ చైర్మన్ చంద్రమోహన్ రెడ్డి, ఏరియా కోఆర్డినేటర్ కే. గంగారెడ్డితో పాటు లయన్స్ క్లబ్ సభ్యులు పి. గంగారెడ్డి, ఎల్. రాజేశ్వర్ రెడ్డి, లక్ష్మీనారాయణ గౌడ్, బి. పరమేశ్వర్, మురళి, మనోహర్ రెడ్డి కార్యక్రమంలో పాల్గొని శిబిరం నిర్వహణకు సహకరించారు.

ప్రజలకు వైద్య సేవలు అందించడంలో భాగంగా ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ కృష్ణంరాజు, ఆరోగ్య హాస్పిటల్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, బసవతారకం ఆసుపత్రి ఆర్గనైజర్ బిందు రెడ్డి పాల్గొని శిబిరం నిర్వహణలో తమ సహకారం అందించారు. అలాగే ఎంఐటీ ఇన్‌స్టిట్యూట్ వ్యవస్థాపకులు సురేష్, శ్రీనివాస్ యాదవ్, లేబర్ కమిషనర్ కార్యాలయ అధికారి ముత్యంరెడ్డి తదితరులు హాజరై కార్యక్రమానికి సహకరించారు. మాదిగ హక్కుల పరిరక్షణ సమితి (ఎంహెచ్‌పీఎస్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకె ప్రభాకర్ కూడా శిబిరంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించారు.

# ఉప్పల్‌లో మామ బేకర్స్ నాల్గవ బ్రాంచ్ ప్రారంభం

**నాణ్యత, రుచికి ప్రాధాన్యతతో వినియోగదారులకు విభిన్న రకాల బేకరీ ఉత్పత్తులు**

**ఉప్పల్, సెప్టెంబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) :**



ఉప్పల్ రింగ్ రోడ్ సమీపంలో ప్రముఖ మామ బేకర్స్ నాల్గవ బ్రాంచ్‌ను ఘనంగా ప్రారంభించారు. బేకరీ రంగంలో నాణ్యత, రుచికి ప్రాధాన్యత ఇస్తూ వినియోగదారులకు విభిన్న రకాల బేకరీ ఉత్పత్తులను అందించాలనే లక్ష్యంతో సంస్థను విస్తరిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మామ బేకర్స్ ఓనర్లు ధనుంజయ్ రెడ్డి, భరత్ సింహ రెడ్డి మాట్లాడుతూ.. వినియోగదారుల ఆదరణతో తమ సంస్థ వరుసగా కొత్త బ్రాంచ్‌లను ప్రారంభిస్తోందని పేర్కొన్నారు. మొదటి బ్రాంచ్‌ను మన్సూరాబాద్‌లో ప్రారంభించగా, అనంతరం ఆల్కాపురి, కొత్తపేట ప్రాంతాల్లో మరో రెండు బ్రాంచ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాజాగా ఉప్పల్ రింగ్ రోడ్ సమీపంలో నాల్గవ బ్రాంచ్‌ను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా నాణ్యమైన బేకరీ ఉత్పత్తులను అందించడంతో పాటు, మెరుగైన సేవలను అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. మామ బేకర్స్‌ను ఆదరిస్తున్న వినియోగదారులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ప్రాంతాల్లో బ్రాంచ్‌లను విస్తరించే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.

# డిగ్రీ ప్రవేశాల జాప్యాన్ని నివారించి వెంటనే తరగతులు ప్రారంభించాలి:

## రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం అంకన్న

**కడప, సెప్టెంబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) :**

డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల ప్రక్రియలో జరుగుతున్న తీవ్ర జాప్యాన్ని నివారించి, విద్యా ర్థుల విద్యా సంవత్సరం నష్టపో కుండా వెంటనే తరగతులు ప్రారంభించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం అంక న్న రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం కడప నగరం లోని పీడీఎస్‌యూ రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో నిర్వ హించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇంటర్మీడియట్ ఫలితాలు వెలువడి నాలుగు నెలలు గడిచినా డిగ్రీ ప్రవేశాల ప్రక్రియ పూర్తికాకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. సీట్ల కేటాయింపును పదేపదే వాయి దా వేయడం వల్ల వేలాది మంది విద్యార్థులు తీవ్ర అయోమ యానికి గురవుతున్నారని, వారి విలువైన విద్యా సమయం నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. డిగ్రీ ప్రవేశాల కౌన్సె లింగ్‌ను వెంటనే పూర్తి చేసి, సీట్ల కేటాయింపు ప్రక్రియను పారద ర్శకంగా నిర్వహించి తరగతు లను తక్షణమే ప్రారంభించాలని ఎం. అంకన్న డిమాండ్ చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఖాళీ గా ఉన్న



అధ్యాపక పోస్టులను భర్తీ చేయడంతో పాటు అవస రమైన మౌలిక వసతులు కల్పించాలని కోరారు. విద్యార్థు ల భవిష్యత్తును దృష్టిలో ఉం చుకుని ప్రవేశాల ప్రక్రియను వేగవంతం చేసి, స్పష్టమైన వి ద్యా క్యాలెండర్‌ను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తక్ష ణమే స్పందించి సమస్యను పరిష్కరించకపోతే విద్యార్థుల హక్కుల కోసం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని చేపడ తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ కడప, అన్నమయ్య జిల్లాల నాయకులు మనోజ్, మహేష్, పండు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య కేంద్ర ప్రయోగశాలను పరిశీలించిన జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారిణి



**తెనాలి, (జర్నలిస్ట్ ఫైల్):** మండల గ్రామమైన సంగం జాగర్లమూడి ఆరోగ్య కేంద్రం ప్రయోగశాలను సోమవారం జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ సిబ్బందితో కలిసి పరిశీలించారు. వైద్యశాల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ప్రతిరోజు ఎంత మంది రోగులు వైద్యశాలకు వచ్చి వైద్య సేవలు పొందుతున్నది సిబ్బందిని అడిగితెలుసుకున్నారు.

జ్వరముల తీవ్రత రక్తపూతల నమూనాల సేకరణ, ప్రయోగశాల పనితీరు క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగు సలహాలు,సూచనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లాఉపవైద్యఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ మాట్లాడుతూ ఆరోగ్య కేంద్ర సేవలను గ్రామస్తులు సద్విని చేసుకోవాలని, జ్వరము వచ్చినదవెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి వైద్యునిసలహా మేరకు చికిత్స పొందవలసిందిగా కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ షేక్ హనీఫ్, తెనాలి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ అందె బాలచంద్రమౌళి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆళ్లగడ్డ వెంకటేశ్వరరావు, ల్యాబ్ టెక్నీషియన్ చెరుకూరి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌టీఆర్ భరోసా కొత్త పింఛన్లకు దరఖాస్తుల ఆహ్వానం



- 16వ తేదీలోపు వార్డు సచివాలయాల్లో నమోదు చేసుకోవాలి

**తాడేపల్లి(జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో అర్హులైన ప్రజలకు ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పథకం కింద కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు కమిషనర్ అలీం బాషా తెలిపారు. సెప్టెంబర్ 7 నుంచి 16వ తేదీ వరకు కొత్త పింఛన్ల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు.వృద్ధాప్య, వితంతువు, చేనేత, వికలాంగులు, ఒంటరి మహిళలు, డప్పు కళాకారులు, మత్స్యకారులు, కల్లుగీత కార్మికులు, చర్మకారులు, ట్రాన్స్‌జెండర్ కేటగిరీలకు చెందిన అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దరఖాస్తుదారులు ఆధార్ కార్డు, రైస్ కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రంతో పాటు సంబంధిత పింఛను కేటగిరీకి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలన్నారు. అర్హులు తమ పరిధిలోని వార్డు సచివాలయంలో స్వర్ణ వార్డు డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ (డబ్ల్యూడీఎస్)ను సంప్రదించి సెప్టెంబర్ 16వ తేదీలోపు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని అలీం బాషా సూచించారు.

## వడ్డెర సంఘ అన్నదాన సత్రానికి భూమి పూజ



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):** బ్రహ్మంగారిమఠంలోని పోలేరమ్మ గుడి వద్ద రాష్ట్ర ఒడియ రాజుల సంఘం ఆధ్యాత్మిక చింతన పెంపొందించుటకు తమ వంతు సహకారంగా బ్రహ్మంగారి దేవాలయమునకు వచ్చు భక్తుల సౌకర్యం కొరకు అన్నదాన సత్రం నిర్మించుటకై భూమి పూజతో ప్రారంభించడం జరిగింది ఈ కార్యక్రమంలో అచలానంద ఆశ్రమ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విరిజానంద స్వామి పెద్ద మఠం మఠాధిపతులు సోదరుడు దత్తాత్రేయ స్వాములవారు తెదేపా మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కానాల మల్లికార్జునరెడ్డి బీసీ చైతన్య సమితి సలహాదారులు తమ్మిశెట్టి సుబ్బరాయుడు దంపతులు మాజీ మండల ఉపాధ్యక్షుడు ముడుమాల పోలిరెడ్డి మండల తెలుగుదేశం నాయకులు ఎస్సార్ శ్రీనివాస రెడ్డి తెలుగుదేశం మండల ఉపాధ్యక్షుడు శీలం నరసింహ గౌడ్ సిద్దయ్య గారి మఠం పీఠాధిపతులు శ్రీనివాస స్వామి గురయ్య బీసీ చైతన్య సమితి మండల అధ్యక్షుడు మల్లె బాలకృష్ణ మాజీ మండలాధ్యక్షుడు దేవర్ల చక్రవర్తి మరియు ఒడియ రాజుల సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 22 (ఎ) కేసులు త్వరగా పరిష్కరించాలి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** 22 (ఎ) కేసులు త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. నిర్దేశిత గడువులో పరిష్కారం కావాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక, 22 (ఎ) కేసులు తదితర అంశాలపై జిల్లా, మండల స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుండి అందే అర్జీలు పట్ల స్పష్టమైన విచారణ చేయాలన్నారు.

అర్జీలపై సంతృప్తికరమైన పరిష్కారం చూపించాలని, పరిష్కారం కాని వాటికి సరైన ఎండార్స్ మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ నిర్దేశిత సమయం దాటరాదని చెప్పారు. అధికారులందరూ ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. ఎండార్స్ మెంట్ సక్రమంగా ఇవ్వని అధికారులు వివరణ ఇవ్వాలని ఆదేశించారు. పి.జి.ఆర్.ఎస్ కు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న సంగతి గుర్తించాలని అన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు పక్కాగా, సంతృప్తికర రీతిలో అందుటకు ప్రతి శాఖ శ్రద్ధ చూపాలని ఆదేశించారు. సేవలు బాగా అందించడం ద్వారా మనకు సంతృప్తి లభిస్తుందని గ్రహించాలని ఉద్బోధించారు. పురపాలక సంఘాల పరిధిలో రహదారుల నిర్వహణపై దృష్టి సారించాలని ఆదేశించారు. జలధార క్రింద మంజూరైన చెరువు పనులు త్వరగా పూర్తి చేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ, ముఖ్య ప్రణాళిక అధికారి పి.శేష శ్రీ, తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో వీరభద్రస్వామి 25వ వార్షిక మహోత్సవం



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో కొలువైన శ్రీ వీరభద్రస్వామి 25వ వార్షిక మహోత్సవాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్ ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బంది, ఆలయ నిర్వాహకులు ఎస్పీకి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఏఆర్ డీఎస్పీ శంకరయ్య దంపతులతో కలిసి ఎస్పీ ప్రత్యేక పూజలు, హోమంలో పాల్గొన్నారు. ఆలయ పూజారి వంశీ ఆధ్వర్యంలో ఐదుగురు వేద పండితులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పోలీస్ సిబ్బంది సంక్షేమం, వారి కుటుంబాల శ్రేయస్సు, జిల్లాలో శాంతిభద్రతలు సక్రమంగా కొనసాగాలని స్వామివారిని ప్రార్థించినట్లు ఎస్పీ తెలిపారు.

మహోత్సవం సందర్భంగా సాయంత్రం సుమారు 1,200 మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ అలహరి శ్రీనివాస్, ఏఆర్ డీఎస్పీ శంకరయ్య దంపతులు, ఏఆర్ఆర్ఐలు శ్రీనివాస్ రెడ్డి, కృష్ణయ్య, ఆర్ఎస్ఐలు, ఏఆర్ఎస్ఐలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు, పీఆర్వో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. వీరభద్రస్వామి ఆశీస్సులతో జిల్లా పోలీస్ శాఖ మరింత సమర్థవంతంగా ప్రజలకు సేవలందించాలని, జిల్లాలో శాంతిసౌఖ్యాలు నెలకొనాలని అధికారులు, సిబ్బంది ఆకాంక్షించారు.

# హోటల్‌లో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** పేకాట, జూదం, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై గుంటూరు జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని రింగ్‌రోడ్ వద్ద ఉన్న హోటల్ సిద్ధివీర్ గ్రాండ్‌లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో టాస్క్‌ఫోర్స్ బృందం ఆదివారం రాత్రి దాడి నిర్వహించింది.

డీఎస్‌బీ డీఎస్పీ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ--2కు సమాచారం అందించగా, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది నల్లపాడు పోలీసులతో కలిసి రాత్రి సుమారు 8.20 గంటలకు హోటల్‌లోని 205వ నంబర్ గదిపై దాడి చేశారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.6,200 నగదు, ఆరు సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

అదుపులోకి తీసుకున్న వ్యక్తులతో పాటు స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాన్ని తదుపరి చట్టపరమైన విచారణ, చర్యల కోసం నల్లపాడు పోలీస్‌స్టేషన్ సిబ్బందికి అప్పగించారు. గుంటూరు జిల్లా పరిధిలో పేకాట, జూదం, ఇతర అసాంఘిక కార్య కలాపాలకు పాల్పడే వారిపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.

## ఎస్టీ కాలనీవాసులకు భూములు దక్కేంతవరకు పోరాటం కొనసాగిస్తాం

- అసైన్డ్ భూముల రక్షణ కోసం ఉధృతపోరాటాలు
- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి.శివకుమార్,వి.అన్వేష్ హెచ్చరిక



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):** మండలంలోని లింగాలదిన్నె పల్లె ఎస్టి కాలనీవాసుల అసైన్డ్ భూములు వారికి దక్కేంతవరకు పోరాటం కొనసాగిస్తామని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు

జి శివకుమార్, వి.అన్వేష్ లు హెచ్చరించారు. సోమవారం బ్రహ్మంగారిమఠం మండల తహసిల్దార్ కార్యాలయం ముందు లింగాలదిన్నెపల్లె అసైన్డ్ భూముల రక్షణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగ దర్నాను ఉద్దేశించి శివకుమార్ అన్వేష్ లు మాట్లాడుతూ లింగాలదిన్నె పల్లె ఎస్టీ,బీసీలకు 2008వ సంవత్సరంలో పలుగురాళ్లపల్లెరెవిన్యూపొలం1938సర్వేనెంబర్ నందు 94 మంది ర్,ఎఎ లకు ఎకరా చొప్పున అసైన్డ్ పట్టాలు మంజూరు చేశారని 2011వ సంవత్సరంలో సబ్ డివిజన్ చేసి,మ్యాప్ వేసి,హద్దులను ఏర్పాటుచేసి

భూమి అప్పగింత పత్రాలు కూడ మంజూరు చేశారని నాటినుండి ఆభూములను ఎస్టీ బీసీలు సాగు చేసుకుంటున్నారని వారు గుర్తు చేశారు గత నాలుగు సంవత్సరాల నుండి దళితులను రెచ్చగొడుతూ వారిని అడ్డం పెట్టుకుని భూములను కాజేయాలనీ కుట్రపన్నిన కొంతమంది భూకబ్జాదారులు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి చేరి అసైన్డ్ మెంట్ లబ్ధిదారులను ఇబ్బందులు పెడుతున్నారనివారు విమర్శించారు. తహసిల్దారు జోక్యం చేసుకొని బాధితులకు భూ ఆక్రమణదారుల నుండి రక్షణ కల్పించి పాస్ పుస్తకాలు మంజూరు చేసి ఆన్ లైన్ చేయాలనీ 1938 సర్వేనెంబర్ నందు 5 మంది దాదాపు 100 ఎకరాల భూమిని ఆక్రమించుకొని ఉన్నారని వాటిని స్వాధీనం చేసుకొని జోగుపల్లి,ముడుమాల పలుగురాళ్లపల్లె గ్రామాల్లోని దళితులకు పంచాలని వారు డిమాండ్ చేశారు. 1938 సర్వే నంబర్లో జోగుపల్లి పలుగురాళ్లపల్లి మల్లేపల్లి పాపిరెడ్డిపల్లి గ్రామాలలోని పేదలకు దాదాపు 400 ఎకరాలకు డీకేట్ పట్టాలు మంజూరు చేసి ఉన్నారని వెంటనే వీరందరికీ సర్వే చేసి భూములు పంచాలని లేనిపక్షంలో 10వ తేదీ నుండి ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని వారు అధికారులను హెచ్చరించారు అనంతరం తహసిల్దార్ వారికి ఎస్టీ కాలనీవాసులకు సంబంధించిన అసైన్డ్ భూములకు సంబంధించి డీకేటి పట్టాలు భూముల అప్పగింత పత్రాలు స్కెచ్,మ్యాపు మొదలు రికార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షులు గండి సునీల్ కుమార్ అసైన్డ్ భూముల రక్షణ కమిటీ సభ్యులు ఆంజనేయులు వెంకటకృష్ణ రఘు అనసూయమ్మ బాధిత ప్రజలు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సిద్ధం

- కడప జిల్లా గడ్డపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎప్పటికీ రెపరెపలాడాలి



**కడప (జర్నలిస్ట్ ఫైల్):** కడప నగరంలోని కడప కన్వెన్షన్ హాల్ నందు జిల్లా అధ్యక్షులు పి రవీంద్రనాథ్ రెడ్డి అధ్యక్షతన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో కడప ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి మాజీ డిప్యూటీ సీఎం ఎస్ బి అంజాద్ భాషా గారు సిఇసి సభ్యులు కే సురేష్ బాబు ఎమ్మెల్సీ డిసి గోవింద్ రెడ్డి రాజంపేట ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి గారు బద్వేల్ ఎమ్మెల్యే దాసరి సుధా రాచమల్లు శివప్రసాద్ రెడ్డి కమలాపురం ఇన్చార్జ్ రామాంజనేయ రెడ్డి జిల్లా పరిశీలకులు కొండూరు అజయ్ రెడ్డి మాజీ మేయర్ పాక సురేష్,రాజుజ సభ్యులు యానాదయ్య , కడప నియోజకవర్గం పరిశీలకులు గురు మోహన్, రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ వజ్ర భాస్కర్ రెడ్డి , తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ నెల 23వ తేదీ నుంచి ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తాం. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులందరికీ ఐడీ కార్డులు అందించి పార్టీ శ్రేణులను మరింత సమన్వయంతో ముందుకు తీసుకెళ్తాం. ప్రతి గ్రామం ప్రతి వార్డు ప్రతి పంచాయతీ లో డివిజన్‌లో పార్టీని మరింత బలోపేతం చేస్తాం. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వారి తరఫున నిరంతరం పోరాటం చేస్తాం. కార్యకర్తే పార్టీకి వెన్నెముక. ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తూ వారి కష్టసుఖాల్లో భాగస్వాములమవుతాం. వైఎస్ఆర్ కడప జిల్లాలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండాను రెపరెపలాడేలా చేస్తాం. ఎన్నికల సమయంలో ఏ అధికారి అయినా ఏకపక్షంగా వ్యవహరిస్తూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే అలాంటి వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదని, చట్టం ముందు నిలబెడతాం అని హెచ్చరించారు. అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించి ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి నాయకులు జిల్లాస్థాయి నాయకులు మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

## మంత్రి నారా లోకేష్ చొరవతో
### డోలాస్ నగర్‌లో రూ.1.4 కోట్లతో ఎస్సీ కమ్యూనిటీ హాల్



**తాడేపల్లి(జర్నలిస్ట్ ఫైల్):** మంత్రి నారా లోకేష్ చొరవతో తాడేపల్లి డోలాస్ నగర్‌లో రూ.1.4 కోట్ల అంచనా వ్యయంతో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన జరిగింది. తాడేపల్లి పట్టణ టీడీపీ అధ్యక్షుడు వల్లభనేని వెంకటరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు. 6 వేల చదరపు గజాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ భవనానికి స్నేహ ఫౌండేషన్ నుంచి రూ.కోటి సీఎస్ఆర్ నిధులు, మంగళగిరి–తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ నుంచి రూ.40 లక్షలు వినియోగించనున్నారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు గుత్తికొండ ధనుంజయరావు మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారని అన్నారు.

గుంటూరు పార్లమెంట్ టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వేమూరి మైనర్ బాబు మాట్లాడుతూ లోకేష్ చొరవతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే తాడేపల్లిలో రెండు కమ్యూనిటీ భవనాలు అందుబాటులోకి వచ్చాయని, మరో రెండు నిర్మాణంలో ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, దార దాసు, జంజు మరియదాసు, పలువురు పాస్టర్లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈశ్వరి దేవి మఠం ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ



- ముఖ్యఅతిథిగా హాజరైన విరజానంద స్వామి

**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):** మహాశక్తి స్వరూపిణి జగన్మాత ఈశ్వరిదేవి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సిజిఎఫ్ ద్వారా 3 కోట్ల రూపాయలను మంజూరు చేయించారు. అందులో భాగంగా భాగంగా సోమవారం మఠాధిపతి శ్రీ శివకుమారస్వామి దంపతులు ఆధ్వర్యంలో ఎంతో భక్తి శ్రద్ధలతో ఘనంగా శంకుస్థాపన మహోత్సవం నిర్వహించామని కార్యనిర్వహణాధికారి బి వి జగన్ మోహన్ రెడ్డి తెలిపారు.

ఈ కార్యక్రమానికి అచలానంద స్వామి ఆశ్రమం పీఠాధిపతి శ్రీ విరజానంద స్వామి,తెదేపా మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులు కానాల మల్లికార్జున రెడ్డి,కాంట్రాక్టర్ పూజ శివయాదవ్ సొసైటీ చైర్మన్ సాంబశివారెడ్డి, నొస్సం దత్తాత్రేయ స్వామి పి పి ఎన్ ప్రసాద్, సంపత్ కుమార్,వీరపు ఉమాపతి, ముక్కామల భాస్కర్ రెడ్డి సుంకు సురేష్ వేద పండితులు,తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వేద అతిథులు కొబ్బరికాయ కొట్టి,నవధాన్యాలు వేసి వేదమంత్రోచ్చారణల మధ్య ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమం విజయవంతంగా పూర్తి అయి భక్తులకు మరింత సౌకర్యవంతమైన ఆధ్యాత్మిక వాతావరణం కల్పించాలని ఈ సందర్భంగా నిర్వాహకులు ఆకాంక్షించారు.

## వాయు కాలుష్య నియంత్రణలో గుంటూరుకు జాతీయ పురస్కారం



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** వాయు కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణలో విశేష ప్రతిభ కనబరిచిన గుంటూరు నగరపాలక సంస్థకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. కేంద్ర పర్యావరణ శాఖ నిర్వహించిన లిలి'స్వచ్ఛ వాయు సర్వేక్షణ్--2026'లిలిలో గుంటూరు నగరం పట్టణాల కేటగిరీలో ద్వితీయ స్థానాన్ని సాధించి ప్రతిష్ఠాత్మక జాతీయ పురస్కారాన్ని దక్కించుకుంది.

న్యూఢిల్లీలోని ఇందిరా పర్యావరణ్ భవన్‌లోని గంగా ఆడిటోరియంలో 'స్వచ్ఛ వాయు దివస్' సందర్భంగా సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జాతీయ హరిత ట్రిబ్యునల్ ఛైర్‌పర్సన్ జస్టిస్ ప్రకాష్ శ్రీవాస్తవ చేతుల మీదుగా గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్ అవార్డును స్వీకరించారు. దేశవ్యాప్తంగా 130 నగరాలు పోటీపడగా గుంటూరు రెండో స్థానంలో నిలవడం విశేషంగా నిలిచింది.

ఇదిలా ఉండగా, రాష్ట్రస్థాయిలో కేటగిరీ–2లో గుంటూరు నగరపాలక సంస్థ 42వ వార్డు తొలి స్థానాన్ని సాధించింది. వాయు కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణకు కృషి చేసిన అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, నగరవాసులందరికీ కమిషనర్ మయూర్ అశోక్ అభినందనలు తెలిపారు. గుంటూరు నగరానికి లభించిన ఈ జాతీయ పురస్కారం పర్యావరణ పరిరక్షణ దిశగా నగరం చేపడుతున్న చర్యలకు గుర్తింపుగా నిలిచిందని పేర్కొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా? అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి




**బీజేపీ రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి ఎన్. మధుకర్**

**తిరుపతి, (జర్నలిస్ట్ ఫైల్) :** తిరుపతి జిల్లా బీజేపీ పదాధికారుల సమావేశం సోమవారం జరిగింది. సమావేశంలో బీజేపీ రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి ఎన్. మధుకర్ పాల్గొన్నారు. రాబోయే సేవ, సంకల్ప్, అభియాన్ కార్యక్రమాల నిర్వహణతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణుల సన్నద్ధతపై ప్రధానంగా చర్చించారు. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రజలతో నిరంతరం మమేకమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంపై నాయకులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా ఎన్. మధుకర్ మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు, పదాధికారులు సమష్టిగా పనిచేస్తూ సంస్థాగత బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో పార్టీ కార్యకలాపాలను విస్తృతం చేయాలని, ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తూ ప్రజల్లో పార్టీపై మరింత విశ్వాసం పెంపొందించాలని, ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు.

## డీఎస్సీపై వైసీపీ తప్పుడు ప్రచారం



○ నెల్లూరు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

**మంగళగిరి, సెప్టెంబర్ 7 (జర్నలిస్ట్ ఫైల్) :** మెగా డీఎస్సీపై వైఎస్సార్‌సీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని నెల్లూరు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 148 రోజుల్లో 16,347 ఉపాధ్యాయ పోస్టులను పారదర్శకంగా భర్తీ చేసిందన్నారు. గత ఐదేళ్లలో నిరుద్యోగులకు ఒక్క టీచర్ ఉద్యోగం కూడా ఇవ్వని జగన్‌మోహన్‌రెడ్డికి డీఎస్సీ, ఏపీపీఎస్సీ మధ్య తేడా తెలియదని విమర్శించారు. మెగా డీఎస్సీ ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుంటే వైసీపీ కావాలనే తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. కుప్పంలో మాజీ సైనికుడు చక్రపాణిరెడ్డిపై వైసీపీ శ్రేణులు, సాక్షి మీడియా ప్రతినిధులు దౌర్జన్యానికి పాల్పడటం దుర్మార్గమని, సర్టిఫికెట్లపై అనుమానాలుంటే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలే తప్ప వ్యక్తిగతంగా బెదిరింపులకు పాల్పడటం సరికాదన్నారు.

ఎన్టీఆర్ జిల్లాకు చెందిన వేముల రామకృష్ణకు డీఎస్సీలో అక్రమంగా ఉద్యోగం వచ్చిందంటూ వైసీపీ, సాక్షి చేసిన ప్రచారం అవాస్తవమని కోటంరెడ్డి పేర్కొన్నారు. రామకృష్ణ స్వయంగా తనకు ప్రభుత్వ ఉద్యోగం రాలేదని, ప్రస్తుతం ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ మళ్లీ పరీక్షకు సిద్ధమవుతున్నట్లు వెల్లడించారని తెలిపారు.

మెగా డీఎస్సీపై దుష్ప్రచారం చేస్తూ హైకోర్టులో 335 కేసులు వేయించారని, వాటిని న్యాయస్థానం కొట్టివేసిందని పేర్కొన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయాలు మానుకుని వాస్తవాలతో మాట్లాడాలని జగన్‌మోహన్‌రెడ్డికి సూచించారు. రాష్ట్రంలో పెట్టుబడులు, అభివృద్ధి, ఉద్యోగాల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు.

## యువత భవిష్యత్‌ను అడ్డుకునే కుట్ర చేస్తున్న జగన్ : ఎమ్మెల్యే గల్లా మాధవి



**మంగళగిరి, సెప్టెంబర్ 7 (జర్నలిస్ట్ ఫైల్) :** కూటమి ప్రభుత్వం చేపట్టే ప్రతి మంచి కార్యక్రమాన్ని అడ్డుకోవడం, తప్పుడు ప్రచారం చేయడమే జగన్‌మోహన్‌రెడ్డి, వైసీపీ నేతల పనిగా మారిందని టీడీపీ ఎమ్మెల్యే గల్లా మాధవి విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ 148 రోజుల్లో మెగా డీఎస్సీని పారదర్శకంగా నిర్వహించి వేలాది ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామని తెలిపారు.

గత ప్రభుత్వ హయాంలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించని జగన్ ఇప్పుడు యువతకు ఉద్యోగాలు వస్తుండటాన్ని ఓర్వలేక తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం జాబ్ క్యాలెండర్ అమలు చేస్తోందని, ఏటా డీఎస్సీ నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించిందని చెప్పారు. డీఎస్సీపై వైసీపీ చేసిన పలు ఆరోపణలను న్యాయస్థానాలు కొట్టివేసినప్పటికీ అదే ప్రచారాన్ని కొనసాగించడం దురుద్దేశపూరితమన్నారు.

స్పోర్ట్స్ కోటాలో అర్హత సాధించి ఉద్యోగాలు పొందిన భార్యాభర్తలపై ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సరికాదని గల్లా మాధవి అన్నారు. క్రీడల్లో ప్రతిభకు వయసుతో సంబంధం లేదని, నిబంధనలకు అనుగుణంగా ఉద్యోగాలు సాధించిన యువత జీవితాలతో రాజకీయాలు చేయవద్దని సూచించారు. భవిష్యత్తులో జరగబోయే డీఎస్సీలను అడ్డుకునేందుకే ఇప్పటి నుంచే వైసీపీ తప్పుడు ప్రచారం ప్రారంభించిందని ఆరోపించారు. ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని మంత్రి నారా లోకేష్ ప్రకటించిన నేపథ్యంలో యువత ఉద్యోగాల కోసం సిద్ధమవుతుంటే వారిలో గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.

గత ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీ గ్రూప్–1 పరీక్షల నిర్వహణలో జరిగిన తప్పిదాలపై జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. యువత భవిష్యత్తుతో రాజకీయాలు చేయకుండా, కూటమి ప్రభుత్వం చేపడుతున్న ఉద్యోగ నియామకాలను అడ్డుకునే ప్రయత్నాలను వైసీపీ మానుకోవాలని గల్లా మాధవి హితవు పలికారు.

# నియోజకవర్గానికి రూ.కోటి.. 25 లక్ష్యాలు!






○ అభివృద్ధి పనులకు ప్రాధాన్యతా క్రమం
○ కేడర్‌తో సమన్వయం.. ప్రజలతో నిరంతర మమేకం
○ స్థానిక ఎన్నికల్లో గెలుపే తొలి అడుగు: సీఎం

**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వం పట్ల ప్రజల్లో ఉన్న సానుకూలతను స్థానిక ఎన్నికల్లో ఓట్లుగా మారేలా పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. స్థానిక సంస్థల్లో విజయమే లక్ష్యంగా నేతలు సమిష్టిగా పనిచేయాలని ఆదేశించారు. ఎన్నికలను తేలిగ్గా తీసుకోకుండా, కూటమి నేతలంతా సఖ్యతగా పనిచేస్తూ, ఎలాంటి గ్యాప్‌లు లేకుండా చూసుకోవాలని సూచించారు. టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు, పార్టీ బలోపేతం, నియోజకవర్గాల అభివృద్ధిపై చంద్రబాబు కీలక సూచనలు చేశారు.

నియోజకవర్గానికి రూ. 1కోటి చొప్పున కేటాయింపు : డబ్బు ఒక్కటే ఎన్నికల్లో గెలిపించదని, ప్రజలు, కేడర్‌తో బలమైన అనుబంధమే విజయానికి పునాది అని సీఎం పేర్కొన్నారు. కేడర్‌ను నిర్లక్ష్యం చేయకుండా వారిని ఒప్పించి, కలుపుకొని పనిచేస్తే ప్రజాప్రతినిధుల బలం వందరెట్లు పెరుగుతుందని అన్నారు. నియోజకవర్గాల్లో చిన్నచిన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని సమావేశంలో బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన కోరగా... ప్రతి నియోజకవర్గానికి రూ. 1 కోటి చొప్పున నిధులు అందించేందుకు సీఎం చంద్రబాబు అంగీకరించారు. ప్రభుత్వం సమకూర్చే నిధులతో పాటు ఎంపీ ల్యాడ్స్ నిధులను కూడా సమర్థంగా వినియోగించుకోవాలని సీఎం సూచించారు. తమ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులకు ఎంపీలు నిధులు కేటాయించాలని స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గానికి 25 ప్రాధాన్యతాంశాలు : ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో 25 ప్రాధాన్యతాంశాలను గుర్తించి, వాటి ఆధారంగా అభివృద్ధి ప్రణాళిక రూపొందించుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. ప్రాధాన్యతా అంశాలపై లక్ష్యాలు నిర్దేశించుకుని పనిచేస్తే ప్రజల్లో గుర్తింపు, గౌరవం లభిస్తాయని చెప్పారు. ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని, పెట్టుబడులను ఆకర్షించి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం లక్ష్యాలతో ముందుకెళ్తోందని తెలిపారు. ప్రజల్లో నిత్యం ఉంటూ, కేడర్‌తో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని సీఎం సూచించారు. తాను తొలిసారి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం మంత్రులు, అధికారుల చుట్టూ తిరిగేవాడినని, గంటల తరబడి అపాయింట్‌మెంట్ కోసం వేచి చూసేవాడినని గుర్తుచేశారు. సమస్య పరిష్కారమయ్యే వరకు వదిలిపెట్టకుండా పనిచేశామని చెప్పారు. ప్రజలతో నిరంతరం మమేకమవుతూ, నాయకత్వాన్ని బలోపేతం చేసుకుంటూ ఈ స్థాయికి చేరుకున్నామని వివరించారు. ప్రతి పదేళ్లకోసారి జనరేషన్‌లో మార్పు వస్తుందని, ఆ మార్పులకు అనుగుణంగా నాయకుల పనితీరు కూడా మారాలని చంద్రబాబు అన్నారు. ఈ తరానికి తగినట్టుగా వ్యవహరించినప్పుడే రాజకీయాల్లో విజయాన్ని సాధించగలమని చెప్పారు. నాయకుల నడవడికను ప్రజలు నిరంతరం గమనిస్తుంటారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు.

2029పై ఇప్పటి నుంచే గురి : 2029 ఎన్నికల్లో 2024 కంటే మెరుగైన ఫలితాలు సాధించాలని ముఖ్యమంత్రి అన్నారు. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించడంపైనే తన ధ్యాస, ఆలోచన ఉందన్నారు. పరిపాలనతో పాటు పార్టీకి కూడా ప్రతిరోజూ సమయం కేటాయిస్తున్నానని చెప్పారు. ఈ నేపథ్యంలో ముందుగా స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయాన్ని సొంతం చేసుకుని, ఆ తర్వాతి ఎన్నికలకు మరింత బలమైన పునాది వేసుకోవాలని పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ల ద్వారా పోటీ చేసే అభ్యర్థుల్లో సమర్థవంతమైన మహిళా నాయకులను గుర్తించాలని చంద్రబాబు సూచించారు. ప్రజలను గెలిపించేలా... కేడర్ తమ కోసం పనిచేసేలా నాయకత్వాన్ని పెంచుకోవాలని నేతలకు స్పష్టం చేశారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఇలాంటి సమావేశాలను నిర్వహిస్తామని సీఎం తెలిపారు. ఎమ్మెల్యేలు అమలు చేస్తున్న బెస్ట్ ప్రాక్టీసెస్‌ను తదుపరి సమావేశాల్లో ప్రదర్శించాలని సూచించారు.

## కాపు భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ పురందేశ్వరి

○ కాపు భవనం కేటాయించిన 30 సెంట్ల స్థలం వర్సిటీ పరిధిలోకి రాదు... వర్సిటీ భూములంటూ అపోహలు వద్దు... కాపు భవన స్థలంపై క్లారిటీ ఇచ్చిన మంత్రి కందుల దుర్గేష్
○ కూటమి ప్రభుత్వంతోనే దశాబ్దాల కల సాకారం: మంత్రి కందుల దుర్గేష్



**రాజమహేంద్రవరం (జర్నలిస్ట్ ఫైల్) :** రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ పరిధిలోని కలెక్టరేట్ సమీపంలో కాపు భవన నిర్మాణానికి కూటమి ప్రభుత్వం కేటాయించిన 30 సెంట్ల స్థలంలో సోమవారం భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ముఖ్య అతిథులుగా హాజరై శంకుస్థాపన చేశారు.

**సంకల్ప శుద్ధి ఉంటే సాధించలేనిది లేదు - మంత్రి కందుల దుర్గేష్:** ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. కాపుల కళ్యాణ మండప నిర్మాణానికి స్థలం కేటాయించాలని దశాబ్దాలుగా ప్రయత్నాలు జరుగుతున్నాయని గుర్తుచేశారు. దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరిలు సంకల్పించిన ఈ శుభకార్యానికి నేడు భూమిపూజ జరగడం ఎంతో సంతోషకరమన్నారు. కొందరు కావాలని ఇది విశ్వవిద్యాలయ స్థలమని దుష్ప్రచారం చేస్తూ అడ్డంకులు సృష్టించారని, అయితే ఈ 30 సెంట్ల స్థలానికి విశ్వవిద్యాలయంతో ఎలాంటి సంబంధం లేదని గణాంకాలతో సహా వివరించారు. 2008లోనే మొత్తం 45 ఎకరాల స్థలంలో విశ్వవిద్యాలయ పరిధిని 20 ఎకరాలకు పరిమితం చేశారని తెలిపారు.

మిగిలిన 25 ఎకరాల్లో 10 ఎకరాలను అగ్రికల్చర్ యూనివర్సిటీ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ లకు కేటాయించగా, అందులోనే ప్రస్తుతం కలెక్టరేట్ కొనసాగుతోందన్నారు. గోదావరి గ్యాస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఎకరన్నరతో పాటు ఇతర ప్రభుత్వ సంస్థలకు మిగిలిన స్థలాన్ని కేటాయించారని, కాబట్టి కాపు భవనానికి ఇచ్చిన స్థలం వర్సిటీ పరిధిలోకి రాదని స్పష్టం చేశారు. సమాజంలో ఎవరికీ ఇబ్బంది కలగని రీతిలో ఈ సత్కార్యం జరిగిందని ఆనందం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన ఈ మంచి కార్యక్రమం వల్ల ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్నారు.

ఈ సందర్భంగా కార్త్యవీర్యార్జునుడి ఉదాహరణను ప్రస్తావిస్తూ.. సాధారణంగా రెండు చేతులు ఉండే ఆయనకు యుద్ధ సమయంలో వెయ్యి చేతులతో బాణాలు సంధిస్తారని, అలాగే అవసరమైతే ప్రజా సంక్షేమం కోసం తాను కూడా వెయ్యి చేతులంత శక్తితో నిలబడతానని స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చెప్పినట్లుగా పెద్దన్న పాత్ర పోషిస్తూ, ఎలాంటి వివక్ష లేకుండా సమాజంలోని అన్ని కులాలను, వర్గాలను కలుపుకుని ముందుకు పోవాల్సిన అవసరం ఉందన్నారు.

భవన నిర్మాణం వేగవంతంగా పూర్తయి, సంపూర్ణ రూపుదిద్దుకున్నప్పుడే మన సంకల్పం పూర్తిగా సిద్ధిస్తుందని, ఇందుకోసం అందరం కలిసి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం వల్లే ఈ కల సాకారమైందని పేర్కొంటూ ఇందులో కీలక పాత్ర పోషించిన ఎంపీ పురందేశ్వరికి మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఈ భూమి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు అల్లూరి శేషు నారాయణ, గౌరవ అధ్యక్షులు రామినీడి మురళీ, సంఘ నాయకులు అచ్యుత రామారావు గంగా కిషోర్, ఎస్. శ్రీను తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి ఉపాధ్యాయుల పాలాభిషేకం

○ నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** ఉపాధ్యాయులు, ఉద్యోగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకున్న నేపథ్యంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం గుంటూరు మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.

నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొనిగల హైమారావు మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 12వ వేతన సవరణ సంఘం నియామకానికి ప్రభుత్వం అంగీకరించడం, రెండు డీఏలు విడుదల చేయడం, 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న సంపాదిత సెలవుల నగదు చెల్లింపును సంక్రాంతి కానుకగా ప్రకటించడం పట్ల ఉద్యోగుల్లో ఆనందం నెలకొందన్నారు. ఈ నిర్ణయాలకు కృతజ్ఞతగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ధన్యవాదాలు తెలిపారు. పోలీసులకు అదనపు సరెండర్ లీవ్‌ను దసరా నాటికి చెల్లించడం, అదనపు క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను జనవరి 2027 నుంచి అమలు చేయడం, ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌ను స్ట్రీమ్‌లైన్ చేయడం వంటి నిర్ణయాలు ఉద్యోగుల సంక్షేమానికి దోహదపడతాయని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా నాయకులు, ఉపాధ్యాయులు సీఎం నాయకత్వం వర్ధిల్లాలి", థ్యాంక్యూ సీఎం సార్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మున్సిపల్ కన్వీనర్ పి. లలిత బాబు, రాష్ట్ర కార్యదర్శి షేక్ అబ్దుల్ ఖలీల్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి. సాయి విశ్వనాథ్, ఎన్. భాస్కర్, ఎన్. వేణుగోపాల్, గుంటూరు నగర నాయకులు టి. రవి, కే. వీరరాఘవులు, టి. శ్రీనివాస్, కే. వేణుగోపాల్, కే. పూర్ణచంద్రరావు, వి. రామకృష్ణ, శామ్యూల్ పాల్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కార్యకర్తలే టీడీపీకి అసలైన బలం



**మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**అమరావతి, సెప్టెంబర్ 7(జర్నలిస్ట్ ఫైల్) :** గ్రామస్థాయి నుంచి బలమైన క్యాడర్, కార్యకర్తలు, నాయకత్వ వ్యవస్థ కలిగిన పార్టీ టీడీపీ అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో నాయకులు, ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. ప్రజల విశ్వాసం పొందడం, వచ్చిన పదవులను సద్వినియోగం చేసుకోవడం ముఖ్యమని, ఐదు కోట్ల జనాభాలో కేవలం 175 మందికే ఎమ్మెల్యేలుగా ప్రజలకు ప్రాతినిధ్యం వహించే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. అధికారం ప్రజలకు సేవ చేసేందుకు లభించిన అవకాశమే తప్ప చెలాయించేందుకు కాదని స్పష్టం చేశారు. ప్రతి సమస్యను పరిష్కరించలేకపోయినా ప్రజలకు అండగా నిలవాలని, వారిని ఇబ్బంది పెట్టడం, వేధించడం మాత్రం చేయరాదని హెచ్చరించారు. ప్రజలకు ఎమ్మెల్యే అందుబాటులో ఉంటారనే నమ్మకం కల్పించి, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలని అన్నారు. నాయకత్వం, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

## 16 వరకు కొత్త పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ



○ స్వర్ణ గ్రామం- స్వర్ణ వార్డు కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో అర్హత కలిగిన మరింత మంది పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర బలహీన వర్గాలకు కొత్తగా అవకాశం కల్పిస్తూ ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద తాజాగా దరఖాస్తుల స్వీకరణ జరుగుతోందని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు సోమవారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ 7 నుంచి 16వ తేదీ వరకు స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాల్లో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందన్నారు. దరఖాస్తుల పరిశీలన నుంచి అర్హత నిర్ధారణ, ప్రభుత్వ ఆమోదం వరకు ప్రతి ప్రక్రియను నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేసి, అర్హులైన వారికి దశల వారీగా పింఛన్లు మంజూరు చేయాలని ఆదేశించారు.

వృద్ధాప్య పింఛనుకు వయస్సు ధృవీకరణ (ఆధార్) పత్రము, వితంతు పింఛను కొరకు భర్త ఆధార్, మరణ ధృవీకరణ పత్రము, ఒంటరి మహిళా పింఛనుకు అవివాహిత కేటగిరిలో సంబంధిత తహశీల్దారు జారీ చేసిన ఒంటరి మహిళా (ాఙఅస్త్రశ్రీవ ఔశీఎవఅ) ధృవీకరణ పత్రము, వివాహిత కేటగిరిలో కోర్టు ఆదాలత్ ద్వారా జారీ చేసిన విడాకుల ధృవీకరణ పత్రము, దివ్యాంగుల పింఛనుకు 40% అంతకు మించి అంగవైకల్యము కలిగిన SADARAM Certificatలను దరఖాస్తుతో పాటుగా స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాలలో 16వ తేదీ లోగా సమర్పించాలని తెలిపారు.

చేనేత/ మత్స్యకార / డప్పు కళాకారులు / చర్మకారులు / కల్లుగీత/ ట్రాన్స్ జెండర్ లు, వృద్ధాప్య / వితంతు/ ఒంటరి మహిళ/ వికలాంగులు సంబంధిత ధృవ పత్రాలతో సమర్పించాలని అన్నారు. దరఖాస్తులను స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు సిబ్బంది ఆన్ లైన్ చేసిన తదుపరి మండల, మునిసిపాలిటి, జిల్లా స్థాయి అధికారులు పరిశీలన అనంతరం 24వ తేదీ లోగా ప్రభుత్వానికి పంపించాలని స్పష్టం చేశారు.

అర్హత ఉన్నప్పటికీ వివిధ కారణాలతో ఇప్పటివరకు పింఛన్ పొందని వారికి మరో అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. జాప్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**పింఛను దరఖాస్తుకు షెడ్యూల్**

సెప్టెంబర్ 7–16: దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ నమోదు, ఈ–కేవైసీ ధృవీకరణ.

సెప్టెంబర్ 17–21: సాధారణ అర్హత పరిశీలన.

సెప్టెంబర్ 22–24: భౌతిక, శాఖాపరమైన ధృవీకరణ, అర్హత నిర్ణయం, సిఫారసు.

సెప్టెంబర్ 25–26: సెర్ప్ ద్వారా బడ్జెట్ ప్రతిపాదనలు, ప్రభుత్వ ఆమోద ప్రక్రియ.

అన్ని స్థాయిల్లో పరిశీలన పూర్తయిన అనంతరం అర్హులైన లబ్ధిదారులకు దశలవారీగా పింఛన్లు మంజూరు చేస్తారన్నారు.

అన్ని స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కేంద్రాల్లో కొత్త పింఛన్ దరఖాస్తు సేవ అందుబాటులో ఉంటుందన్నారు. దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేసిన అనంతరం సిస్టమ్ జనరేటెడ్ అక్నాలెడ్జ్‌మెంట్ అందజేస్తారన్నారు.

**అవసరమైన ధృవపత్రాలు**

అన్ని కేటగిరీలకు సాధారణంగా ఆధార్ కార్డు, రైస్ కార్డు లేదా ఆదాయ ధృవపత్రంతో పాటు సంబంధిత కేటగిరీకి అవసరమైన ప్రత్యేక ధృవపత్రాలను సమర్పించాలి.

వృద్ధాప్య పింఛన్: వయస్సు నిర్ధారణకు ఆధార్.

వితంతు పింఛన్: భర్త మరణ ధృవపత్రం, భర్త ఆధార్ నంబర్.

ఒంటరి మహిళ: వివాహిత అయితే కోర్టు/అదాలత్ విడాకుల డిక్రీ; అవివాహిత అయితే తహసీల్దార్ జారీ చేసే వివాహం కాని ధృవపత్రం.

దివ్యాంగుల పింఛన్: 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ బెంచ్‌మార్క్ దివ్యాంగత్వాన్ని నిర్ధారించే ాూాణాూ=జువీ ధృవపత్రం.

చేనేత కార్మికులు: చేనేత మరియు జౌళి శాఖ ధృవపత్రం.

మత్స్యకారులు: మత్స్య శాఖ ధృవపత్రం.

డప్పు కళాకారులు: సాంఘిక సంక్షేమ శాఖ ధృవపత్రం.

సంప్రదాయ చెప్పుల తయారీదారులు: సాంఘిక సంక్షేమ శాఖ ధృవపత్రం.

కల్లుగీత కార్మికులు: నిషేధ మరియు ఎక్సైజ్ శాఖ ధృవపత్రం.

ట్రాన్స్‌జెండర్ లబ్ధిదారులు: జిల్లా వైద్య మండలి ధృవపత్రం.

ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి. జ్యోతి బసు, డి. ఆర్. డి. ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి. విజయ లక్ష్మి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి. శంకర్, జిల్లా పంచాయతీ అధికారి బి. వి. నాగ సాయి కుమార్, జిల్లా పౌర సరఫరాల అధికారి పి. కోమలి పద్మ, ముఖ్య ప్రణాళిక అధికారి పి. శేష శ్రీ, తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467